ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక · నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 147 శనివారం 16 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 147 Saturday 16 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మహేష్ గౌడ్
- గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని ఆరోపణ
- బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని వ్యాఖ్య



**వార్త సంధ్య,హైదరాబాద్, మే 15 :** తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (జజూ) సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని, బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి 'దొంగ ఓట్ల' సహాయంతోనే గెలిచారని ఘాటుగా ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు లేనందున, ఈ సవరణ ప్రక్రియను తొందరపాటుతో కాకుండా ఏడాది పొడవునా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**వినతిపత్రంలోని ప్రధాన సూచనలు:** గత 25 ఏళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినందున, ఈ ప్రక్రియను ఒకటిన్నర సంవత్సరం నుంచి నుంచి 2 ఏళ్ల పాటు దశలవారీగా చేపట్టాలి. బూత్ - మిగతా 2 లో

## కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!

- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారన్న కవిత
- పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య
- అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత



**వార్త సంధ్య,హైదరాబాద్, మే 15 :** ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ - మిగతా 2 లో




## నా పేరు వాడొద్దు

- కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్
- పోక్సో కేసులో తన పేరును ఉపయోగించకుండా చూడాలని పిటిషన్
- ఇప్పటి వరకు వాడిన వీడియోలు తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి
- తన కుమారుడి వివాదంలో తన పేరు ఉపయోగించకుండా ఉత్తర్వులివ్వాలన్న బండి సంజయ్

## ఎల్‌పీజీ, పెట్రోలియం నిల్వలపై కీలక ఒప్పందాలు

- యూఏఈ పర్యటనలో ప్రధాని మోదీ
- కీలక ఒప్పందాలపై సంతకాలు
- పశ్చిమాసియా సంక్షోభం వేళ యూఏఈలో ప్రధాని మోదీ పర్యటన
- ఇంధన భద్రత, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం
- భారత్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు యూఏఈ అంగీకారం
- గుజరాత్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు మరో కీలక ఎంఓయూ



**వార్త సంధ్య, ఢిల్లీ, మే 15 :** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటిస్తున్నారు. దేశంలో నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన తరుణంలోనే ఈ పర్యటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంధన భద్రతను పటిష్ఠం చేసుకోవడం, ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని - మిగతా 2 లో

## భారత్ నే నమ్ముతున్న రష్యా

- పాకిస్థాన్‌ను నమ్మని పలు దేశాలు
- బ్రిక్స్ సమావేశంలో రష్యా విదేశాంగ మంత్రి సంచలన ప్రతిపాదన
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలను తగ్గించడంలో పాకిస్థాన్‌ది తాత్కాలిక సాయం మాత్రమేనని వ్యాఖ్య
- భారత్ మాత్రమే శాశ్వత పరిష్కారం తీసుకురాగలదని వెల్లడి

**వార్త సంధ్య, ఢిల్లీ, మే 15 :** న్యూఢిల్లీ వేదికగా జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కీలక ప్రతిపాదన చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడంలో భారతదేశం ఒక దీర్ఘకాలిక మధ్యవర్తి పాత్రను పోషించగలదని ఆయన వ్యాఖ్యానించారు.ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తున్నప్పటికీ, అది ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. పాకిస్థాన్ కేవలం అమెరికా ప్రతిపాదనలను మాత్రమే తమ ముందు ఉంచుతోందని... తమ వాదనలను పట్టించుకోవడం లేదని ఇరాన్ ఇప్పటికే ఆరోపించింది. అంతేకాకుండా, ఇజ్రాయెల్, యూఏఈ వంటి దేశాలు కూడా పాక్ మధ్యవర్తిత్వాన్ని అనుమానిస్తున్నాయి. అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం వంటి వారు - మిగతా 2 లో



## మెట్రోలో సాధారణ ప్రయాణికుడిలా తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

- ప్రజా రవాణా వినియోగంపై అవగాహన కల్పించేందుకు మెట్రోలో పయనం
- ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని విన్నపం
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని పిలుపు




## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ

- పవన్ కల్యాణ్ ప్రశంసలు
- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్
- పారిశ్రామికంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య




## భోజ్‌శాల హిందువులదే

- మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు
- ముస్లింల శుక్రవారం నమాజ్ హక్కు రద్దు
- మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వాలని సూచన
- లండన్ నుంచి విగ్రహం తీసుకురావాలని ఆదేశం
- ఏఎస్ఐ సర్వే ఆధారంగా తీర్పు



**వార్త సంధ్య, మధ్యప్రదేశ్ , మే 15 :** మధ్యప్రదేశ్‌లో ధార్ జిల్లాలో ఉన్న వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్‌పై అక్కడి హైకోర్టు చరిత్రాత్మక తీర్పు నిచ్చింది. ఈ వివాదాస్పద కట్టడం - మిగతా 2 లో




## రక్షణ హబ్‌గా రాయలసీమ

- పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమిపూజ
- పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు
- రూ. 15,803 కోట్ల పెట్టుబడితో ఐదో తరం యుద్ధ విమానాల తయారీ
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని సీఎం హామీ

# దేశానికి "రక్షణ" కవచంగా ఆంధ్రప్రదేశ్ నిలబడుతోంది

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- భవిష్యత్తులో పుట్టపర్తికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు
- పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం గర్వకారణంగా ఉందన్న చంద్రబాబు
- భవిష్యత్తులో పుట్టపర్తిలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్న సీఎం
- ఏఎంసీఏ ప్రాజెక్టుకు సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపిన చంద్రబాబు



**వార్త సంధ్య,అమరావతి, మే 15 :** రాయలసీమ దేశానికే రక్షణ సీమగా నిలిచేలా అడుగులు పడ్డాయి. రూ. 15,803 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన ఐదో తరం యుద్ధ విమానాల తయారీకి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి వేదికైంది. అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టుకు రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు చంద్రబాబు చేతుల మీదుగా భూమిపూజ జరిగింది. 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ, ఐ=ఐూ భాగస్వామ్యంతో దీన్ని నిర్మిస్తున్నారు. "ూవీజూ' ఐదో తరం యుద్ధ విమానాల ప్రాజెక్టు ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7,500 మంది నిపుణులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఈ సందర్భంగా సీఎం చంద్రరబాబు మాట్లాడుతూ, పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారని తెలిపారు. సత్యసాయి బాబా బోధనలతో విశ్వశాంతికి కృషి - మిగతా 2 లో

## విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో కుక్క నోట మనిషి కాలు!



- ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన రోగి కాలును నోట కరుచుకు ఎత్తుకెళ్లిన కుక్క
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సీరియస్
- విజయవాడ జీజీహెచ్ ఘటనపై మంత్రి సత్యకుమార్ ఆగ్రహం
- రోగి కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో తొలగింపు
- బయోవేస్ట్‌లో తరలించేందుకు సంచిలో పెట్టి వ్యర్థాల గదిలో ఉంచిన సిబ్బంది
- బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని డీఎంఈకి ఆదేశాలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుక్కల సంచారం లేకుండా చూడాలని ఆదేశం

**వార్త సంధ్య,అమరావతి, మే 15 :** విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స అనంతరం తొలగించిన కాలి భాగాన్ని కుక్క నోటకరిచి తీసుకెళ్లిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## మళ్ళీ అదే

నీట్ రద్దయింది. ఎంబీబీఎస్ సహా మరో పదికోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థుల ప్రతిభను తూచి, వారి ప్రవేశార్హతను నిర్ణయించే జాతీయ స్థాయి సంస్థ అసమర్థత కారణంగా 23లక్షల మంది పిల్లల కష్టం గాలికి కొట్టుకుపోయింది. రెండున్నర లక్షలసీట్లకోసం పోటీపడిన ఒక పరీక్ష ఇంతలోనే పనికిరాకుండాపోవడం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఒక భయంకరమైన మానసిక వేదన. పరీక్ష నిర్వహణలో విఫలమైన సంస్థలే వాటిని మళ్ళీ నిర్వహిస్తాయి, మళ్ళీ ఫీజు కట్టనక్కరలేదని కూడా అంటాయి. కానీ, కచ్చితంగా నెగ్గుకురాగలమని నమ్మకంగా ఉన్న పిల్లలకు ఈ పరిణామం అశనిపాతం. దేశవ్యాప్త సగటుకు ఆరురెట్ల సక్సెస్ రేట్ సాధిస్తున్న రాజస్థాన్‌లోని సికార్ ఈ పేపర్ లీక్ కుట్రకు కేంద్రం కావడంలో ఆశ్చర్యమేమీ లేదు.సీబీఐ రంగంలోకి దిగి ఇద్దరు బీజేపీ నేతలతో సహా ఐదుగురిని అరెస్టు చేసింది. అనుమానితులు అనేకులున్నారు. పరీక్షను సమర్థంగా నిర్వహించలేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఎప్పటిలాగానే పారదర్శకత, విశ్వసనీయత ఇత్యాది పదాలు దట్టించిన ప్రకటనలో తాను ఎందుకు పరీక్ష సక్రమంగా నిర్వహించలేకపోయానన్నది కాక, ఈ పరీక్ష రద్దు ఎందుకు అవసరమో చెప్పుకొచ్చింది. ఇవేమాటలు రెండేళ్ళక్రితం కూడా దేశం విన్నది. అదే భాష, అవే హామీలూ ప్రమాణాలూ. పదేపదే జరిగే తప్పును అసమర్థత అని వదిలేయడం కూడా సరికాదు. పరీక్షను సక్రమంగా, నూరుశాతం కచ్చితత్వంతో నిర్వహించలేని విధానాలను సరిదిద్దుకోకుండా పిల్లల జీవితాలతోనూ, వారి తల్లిదండ్రుల ఆర్థికస్థితిగతులతోనూ ముడిపడిన అంశంలో తిరిగి అదే తప్పిదానికి తావివ్వడం మహాపాపం. దేశంలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనే ఒక పెద్దపరీక్షను లోపరహితంగా నిర్వహించగల వ్యవస్థను సృష్టించలేకపోవడం విషాదం. ఈ ఒక్కరోజు పరీక్ష లక్షలాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. విపరీతమైన పోటీ ఉన్న కోర్సులు కనుక, పసివయసు నుంచే విద్యార్థులమీద ఒత్తిడి మొదలవుతుంది. వైద్యవిద్య చుట్టూ ఉన్న ఆశలూ, ఆకాంక్షలూ బలహీనతలను సొమ్ముచేసుకొనేందుకు పుట్టుకొచ్చిన కోచింగ్ సెంటర్లు తల్లిదండ్రులను ఆర్థికంగా పీల్చిపిప్పిచేస్తాయి, ప్రత్యేక శిక్షణల పేరిట పిల్లలను పగలూ రాత్రీ నలిపివేస్తాయి. నిద్రాహారాలు మాని ర్యాంకు, సీటు సాధించడమే పరమార్థంగా సర్వమూ త్యాగం చేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇంతటి అన్యాయం చేయడం క్షమార్హం కాని నేరం.రెండేళ్ళ క్రితం బిహార్ కేంద్రంగా ఇదే తరహా నేరం జరిగినా, పరీక్షను పాక్షికంగా రద్దుచేసి, వ్యవస్థాగత లోపాలను కప్పిపెట్టిన ఫలితం ఇది. మొదట్లో కాస్తంత దబాయించిన ఎన్టీఏ ఆ తరువాత, ప్రజలనుంచి, రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఒత్తిళ్ళకు తలొగ్గక తప్పలేదు. వెలుగుచూసిన వాస్తవాలు దేశాన్ని నిర్ఘాంతపరిచాయి. 67మంది విద్యార్థులు నూరుశాతం స్కోర్ సాధించడమే కాదు, మరో నలభైమంది తప్పుడు సమాధానానికి గ్రేస్ మార్కులు పొంది తొలిస్థానాలు ఆక్రమించుకున్నారు. కొంతకాలానికి ఎన్టీఏ డైరక్టర్ జనరల్‌ను సస్పెండ్ చేసి, కేసు సీబీఐకి అప్పగించడంతో, స్ట్రాంగ్‌రూమ్ అనుకున్న హజారీబాగ్ స్కూలు గది నుంచే పేపరు బయటకు వచ్చి, నూటయాభైఐదు మంది విద్యార్థులు ప్రత్యక్షంగా లబ్ధిపొందారని తేలింది. హ్యాకింగులు, ట్రాకింగులు, ఎన్‌స్క్రిప్షన్లతో నిమిత్తంలేని లీకు అది. సీబీఐ దేశవ్యాప్త గాలింపులు జరిపింది, లింకులు ఛేదించి, ముప్పై ఆరుమందిని అరెస్టు చేసింది. ఇంతలోగా, పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను నిరోధించే పేరిట 2024 ఫిబ్రవరిలో పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని ప్రభుత్వం ఈ పరిణామం అనంతరం ఆఘమేఘాల మీద అమలులోకి కూడా తెచ్చింది. ఆ ఘోరవైఫల్యం తరువాత ఎన్టిఏ సగర్వంగా ప్రవేశపెట్టిన జీపీఎస్ ట్రాక్డ్ వ్యాన్లు, ఏఐ అధారిత సీసీటీవీలు, సిగ్నల్ జామర్లు, బయోమెట్రిక్ వెరిఫికేషన్లు ఇత్యాదివి సైతం ప్రస్తుత పేపర్ లీక్‌ను ఆపలేకపోయాయి. ఆ కేసు అతీగతీ తేలకముందే ఇప్పుడు మరో కుట్ర జరిగింది. గత ఏడాది కూడా ఒక చిన్నస్థాయి నీట్ కుంభకోణం వెలుగులోకి రావడం వైద్య మాఫియా వ్యవస్థీకృత సామర్థ్యాన్ని తెలియచెబుతోంది. తక్కువ సీట్లకోసం లక్షలమంది పోటీపడుతున్నప్పుడు, ఒక్క మార్కు తేడా కూడా విద్యార్థి భవిష్యత్తును దెబ్బతీస్తుంది. అక్రమార్కుల కుట్రలు మరోపక్క సాగుతూనే ఉంటాయి. అందుకే, ఇతర జాతీయస్థాయి పరీక్షల మాదిరిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో దీనినీ నిర్వహించడం మంచిదని, పరీక్ష ఆరంభమైనప్పుడు తెరుచుకొనే స్మార్ట్ కీలు, డైనమిక్ క్వశ్చన్ విధానాలతో నీట్ యూజీని సమర్థవంతంగా తీర్చిదిద్దాలని నిపుణుల సూచన. పాతికలక్షలమంది విద్యార్థుల జీవితాలతో ముడిపడిన ఒక ప్రశ్నాపత్రాన్ని కొద్దిగంటలపాటు భద్రంగా కాపాడలేని మనకు, భావి పౌరులుగా వారి బాధ్యతలు, కర్తవ్యాల గురించి హితవులు చెప్పే అధికారం ఉన్నదా అన్నది ప్రశ్న.

# భోజ్‌శాల హిందువులదే

**మొదటిపేజీ తరువాయి -** సరస్వతీ దేవి ఆలయమేనని స్పష్టం చేసింది. ముస్లింలు అక్కడ ప్రతి శుక్రవారం నమాజ్ చేసుకోవడానికి అనుమతిస్తూ 2003లో పురావస్తు శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు పూర్తిగా రద్దు చేసింది.ఇకపై భోజ్‌శాల ప్రాంగణంలో మతపరమైన పూజలు చేసుకునే పూర్తి హక్కు హిందువులకే ఉంటుందని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ముస్లిం సమాజం నమాజ్ చేసుకోవడానికి వీలుగా ఈ జిల్లాలోనే వేరే చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ కట్టడం పరమార వంశానికి చెందిన రాజా భోజుడు నిర్మించిన సంస్కృత విద్యా కేంద్రమని స్పష్టం చేసింది.లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న పురాతన సరస్వతీ దేవి విగ్రహాన్ని తిరిగి భారత్‌కు రప్పించేందుకు అధికారిక ప్రయత్నాలు చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. క్రీస్తుశకం 1010 నుంచి 1055 మధ్యకాలంలో రాజా భోజుడు ఈ ప్రసిద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించారని, దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు సూచించారు.గతంలో కోర్టు ఆదేశాల మేరకు పురావస్తు శాఖ ఈ కాంప్లెక్స్‌లో 98 రోజుల పాటు సుదీర్ఘ శాస్త్రీయ సర్వే నిర్వహించింది. ఆలయాన్ని సూచించే భాగాలను ఉపయోగించే ఇక్కడున్న నిర్మాణాన్ని చేపట్టారని ఏఎస్ఐ తన రెండు వేల పేజీల నివేదికలో పేర్కొంది. సర్వేలో దొరికిన నాణేలు, శిల్పాలు, శాసనాలు ఇది హిందూ దేవాలయమేనని నిరూపిస్తున్నాయన్న హిందూ పక్షం వాదనతో కోర్టు ఏకీభవించింది.

# భారత్ నే నమ్ముతున్న రష్యా



**మొదటిపేజీ తరువాయి -** కూడా పాకిస్థాన్‌ను విశ్వసించలేమని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. "తాత్కాలికంగా పాకిస్థాన్ సహాయం చేయవచ్చు. కానీ సుదీర్ఘ దౌత్య అనుభవం, విశ్వసనీయత ఉన్న భారత్ మాత్రమే అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత పరిష్కారాన్ని తీసుకురాగలదు" అని లావ్రోవ్ స్పష్టం చేశారు. దీనికి ప్రధాన కారణం భారతదేశా నికి అటు అమెరికాతోనూ, ఇటు ఇరాన్‌తో నూ ఉన్న బలమైన వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలే. రష్యా చేసిన ఈ ప్రతిపాదన పాకిస్థాన్‌కు దౌత్యపరంగా పెద్ద దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇరాన్ తన సైనిక విమానాలను అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నుంచి రక్షించుకోవడానికి పాకిస్థాన్‌లోని 'నూర్ ఖాన్' ఎయిర్ బేస్‌ను వాడుకుంటోందని అమెరికన్ మీడియా కథనాలు వెలువరించడం కూడా పాకిస్థాన్ విశ్వసనీయతను దెబ్బతీసింది. ఇటువంటి పరిస్థితుల్లో ఒక తటస్థ, శక్తివంతమైన దేశంగా భారత్ పాత్ర కీలకం కానుంది.

# నా పేరు వాడొద్దు



**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. పోక్సో కేసులో భవిష్యత్తులో తన పేరును వాడకుండా చూడాలని పిటిషన్ వేశారు. అలాగే తన పేరుతో ఇప్పటి వరకు వాడిన వీడియోలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడిపై నమోదైన కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కాబట్టి ఈ వివాదంలో తన పేరును ఎక్కడా ఉపయోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.ఇదిలా ఉండగా, బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంపై కేసు నమోదైంది. బాలిక ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాల ప్రసారంపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు.

# దేశానికి రక్షణకవచంగా ఆంధ్రప్రదేశ్ నిలబడుతోంది



**మొదటిపేజీ తరువాయి -** చేశారని గుర్తు చేశారు. పుట్టపర్తి అంటే దేశం గర్వించే రక్షణ కేంద్రంగా తయారవుతుందన్నారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం గర్వకారణంగా ఉందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో పుట్టపర్తిలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుకు సహకరించిన ప్రజలకు అభినందనలు తెలియజేశారు. అలాగే కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు."దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానొక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపురేఖలను పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలు మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. రాయలసీమకు నీళ్లు తీసుకొచ్చేందుకు అనేక ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో సీమ రూపురేఖలు మారబోతున్నాయి" అని చంద్రబాబు తెలిపారు."సీమను హార్టికల్చర్ హబ్‌గా చేసేందుకు రూ.లక్ష కోట్లతో ప్రాజెక్టు చేపడుతున్నాం. రాయలసీమలోని వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్‌ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తాం. 2028 నాటికి కడప స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. రాయలసీమను రతనాల సీమగా చేసే బాధ్యత నాది. శ్రీహరికోట పక్కనే స్పేస్‌సిటీ ఏర్పాటు కాబోతు ంది. రాయలసీమను సగర్వంగా నిలబెట్టేందుకు కృషి చేస్తాం. రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్, ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారింది.ఆర్టీటీకి విరాళాల అంశంలో సమస్యలొస్తే లోకేశ్ పరిష్కరించారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్ అన్నారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామని తెలిపారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతుందన్నారు.

# విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో కుక్క నోట మనిషి కాలు!



**మొదటిపేజీ తరువాయి -** బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగులను ఆందోళనకు గురి చేసిన ఈ ఘటనపై విచారణ జరిపి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శానిటేషన్, సెక్యూరిటీ, పర్యవేక్షణ అధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రాధికారెడ్డికి సూచించారు.కొత్త ప్రభుత్వాసుపత్రిలో ఇన్‌ఫెక్షన్ సోకిన ఓ రోగికి శస్త్రచికిత్స అనంతరం బుధవారం (13-05-2026) కాలి భాగాన్ని తొలగించారు. దీన్ని తరలించేందుకు ఓ సంచిలో వేసి దాన్ని ఆసుపత్రి మొదటి అంతస్తులో ఉంచారు. ఇంతలో మొదటి అంతస్తు వరకు వచ్చిన కుక్క ఆ కాలిని నోట కరుచుకుని బయటకు పరుగులు తీసింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం మీడియాలోనూ ఈ ఉదంతం వెలుగు చూడడంతో మంత్రి సత్యకుమార్ సంబంధిత అధికారులను వివరణ కోరారు. తొలగించిన శరీర బాగాలను బయోవేస్టులో భాగంగా తరలించేందుకు సేఫ్ వాహనం, మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు మూడు రోజులకు ఓసారి ఆసుపత్రికి వస్తుండడంతో- ఈ సంచిని మొదటి అంతస్తులోని వ్యర్థాల గదిలో ఉంచినట్లు తెలుసుకున్నారు. కుక్క మొదటి అంతస్తు వరకు ఎలా వచ్చిందని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు. కుక్క తొలగించిన కాలి భాగాన్ని నోట కరుచుకుని బయట తిరిగిన ఘటనలో ఉద్యోగుల బాధ్యతారాహిత్యం ఉందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై లోతుగా విచారణ జరిపి, నివేదిక పంపాలని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఆసుపత్రుల సూపరింటెండెంట్లంతా అప్రమత్తం కావాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో కుక్కల సంచారం లేకుండా చూడాలని, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.ఇదీ జరిగింది: విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఓ రోగికి శస్త్రచికిత్స చేసి కాలును తొలగించారు. దాన్ని తరలించేందుకు ఓ సంచిలో వేసి ఆసుపత్రి మొదటి అంతస్తులో ఉంచారు. ఇంతలో మొదటి అంతస్తు వరకు వచ్చిన ఓ కుక్క ఆ కాలిని నోట కరుచుకుని బయటకు పరుగులు తీసింది. సేఫ్ వాహనం, మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు మూడు రోజులకొకసారి వస్తుండటంతో ఆ సంచిని మొదటి అంతస్తులో ఉన్న వ్యర్థాల గదిలో ఉంచారు. అందులోకి వెళ్లిన శునకం ఆ సంచిలోని కాలును నోటితో పెట్టుకొని ఆసుపత్రి బయటకు పరుగులు తీసింది. తర్వాత దాన్ని పీక్కుని కొంతభాగం తినేసింది. అనంతరం సిబ్బంది అప్రమత్తమై కుక్కను వెంబడించి దూరంగా వదిలేసిన కాలి భాగాన్ని తీసి భద్రపరిచారని తెలుస్తోంది. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆసుపత్రి అధికారులు గుర్తించారు.

# రక్షణ హబ్‌గా రాయలసీమ

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ, వైమానిక రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా శుక్రవారం భారీ ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం ద్వారా దేశీయంగా ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం కానుంది.ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు అనకాపల్లి జిల్లాలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నావల్ సిస్టమ్స్ యూనిట్, కర్నూలులో ఏర్పాటు చేయనున్న 'డ్రోన్ సిటీ' సహా మొత్తం రూ.4,145 కోట్ల విలువైన మరో 12 రక్షణ ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి ఆంధ్రప్రదేశ్ రక్షణ కవచంగా నిలుస్తోందన్నారు. "ఒకప్పుడు రతనాల సీమగా ఉన్న రాయలసీమను మళ్లీ అదే స్థాయికి తీసుకెళ్లే బాధ్యత నాది. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేసి సీమకు కానుకగా ఇస్తాం," అని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం పేర్కొంది.శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి లోకేష్ తిలకించారు. ఇందులో అత్యాధునిక క్షిపణులు, తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లు, యుద్ధ విమానం ప్రోటోటైప్‌లను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులను డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) అభివృద్ధి చేస్తోంది.

# ఎల్‌పీజీ, పెట్రోలియం నిల్వలపై కీలక ఒప్పందాలు

**మొదటిపేజీ తరువాయి -** మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.అబుదాబిలో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, రక్షణ సహకారం, ప్రజా సంబంధాలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ), వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలకు సంబంధించి రెండు ముఖ్యమైన అవగాహన ఒప్పందాలపై (ఎంఓయూ) సంతకాలు జరిగాయి.వీటితో పాటు ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌పైనా అంగీకారానికి వచ్చారు. గుజరాత్‌లోని ద్వారక జిల్లా వడినార్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన ఎంఓయూపైనా సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలతో పాటు భారత మౌలిక సదుపాయాలు, ఆర్‌బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. ఇది భారత్ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు.ఈ పర్యటన సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో యూఏఈపై ఇరాన్ జరిపిన దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గల్ఫ్ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామిగా ఉన్న యూఏఈతో ఈ తాజా ఒప్పందాలు వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చనున్నాయి. సుమారు 45 లక్షల మందికి పైగా భారతీయులు నివసిస్తున్న యూఏఈలో వారి సంక్షేమం గురించి కూడా ఈ పర్యటనలో చర్చకు వచ్చింది. ప్రస్తుత సంక్షోభ సమయంలోనూ యూఏఈ భారత్‌కు అత్యంత నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతుండటం గమనార్హం.

# బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు



**మొదటిపేజీ తరువాయి -** లెవల్ ఆఫీసర్లు జియో-ట్యాగ్ ఫొటోలతో కనీసం మూడుసార్లు గృహ సందర్శన చేసి భౌతిక ధృవీకరణ చేయాలి.ఓటును తొలగించే ముందు ఏడు రోజుల ముందస్తు రాతపూర్వక నోటీసు తప్పనిసరిగా ఇవ్వాలి. అభ్యంతరాల స్వీకరణకు కనీసం నెల రోజులు గడువు ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.రాజకీయ పార్టీలకు 2002 మరియు 2025 నాటి ఓటర్ల జాబితాల సాఫ్ట్ మరియు హార్డ్ కాపీలను అందించాలి. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ఏఎస్‌డీ) జాబితాలను సకాలంలో పార్టీలకు అందజేయాలి.ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 2002 తర్వాత రాష్ట్రానికి వలస వచ్చి, కనీసం రెండుసార్లు ఓటు వేసిన వారికి అఫిడవిట్ ప్రాతిపదికన ఓటు హక్కు కల్పించాలి.జనాభా గణన, ఎస్ఐఆర్ విధులను వేర్వేరు అధికారులు నిర్వహించాలి. ఒకే అధికారికి రెండు బాధ్యతలు అప్పగించకూడదని కాంగ్రెస్ నేతలు కోరారు.

# గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ



**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో నిలిపే దిశగా రూ. 15,803 కోట్ల భారీ పెట్టుబడితో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ పారిశ్రామిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు.శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏర్పాటు కాబోతున్న 'ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్' దేశ రక్షణలో కీలకం కానుంది. స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా' ప్రాజెక్టులో ఏపీ భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు.ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7,500 మంది యువతకు హై-వాల్యూ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక 'డ్రోన్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయడం ద్వారా డ్రోన్ టెక్నాలజీలో కూడా ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పవన్ కొనియాడారు. ఈ భారీ ప్రాజెక్టు ఏపీకి రావడానికి సహకరించిన ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!



**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు.బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

# మెట్రోలో సాధారణ ప్రయాణికుడిలా తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



**మొదటిపేజీ తరువాయి -** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హైదరాబాద్ మెట్రోలో సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ప్రజా రవాణా వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఆయన తార్నాక నుంచి జూబ్లీహిల్స్ వరకు మెట్రోలో ప్రయాణించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. వ్యక్తిగత కార్ల వాడకాన్ని తగ్గించి, మెట్రో, బస్సుల వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించడం ద్వారా దేశంపై పడే ఆర్థిక భారాన్ని (ఇంధన దిగుమతులు) తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించవచ్చని తెలిపారు.మెట్రోలో ప్రయాణికులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన, ప్రధాని మోదీ 'బాధ్యతాయుత జీవన విధానం' గురించి వివరించారు. అలాగే 'వోకల్ ఫర్ లోకల్' నినాదంలో భాగంగా స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "దేశం కోసం.. భవిష్యత్తు కోసం.. మనందరి బాధ్యత" అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.

## ముఖ్యమంత్రి ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని మాజీ మంత్రి ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ చెప్పారు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య). మే 15 :** శుక్రవారం నాడు ఎమ్మెల్యే క్వార్టర్స్ లో పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను 50 మందికి పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు నియోజకవర్గాన్ని రాజకీయాల అజితంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు కేంద్రమంత్రి తనయుడు విషయంలో తాను ఏమి స్పందించనని కేసు కోర్టులో నడుస్తున్నందున ఏమి స్పందించడం లేదని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ కార్పొరేటర్లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## పుస్తక పఠనంతోనే మేధోవికాసం
### మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరిషయ్య



**మంథని, మే 15 ( వార్త సంధ్య) :** విద్యాభివృద్ధిలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థులు పుస్తక పఠనాన్ని నిత్యకృత్యంగా అలవర్చుకోవాలని మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పరిషయ్య పిలుపునిచ్చారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు కళాశాల లైబ్రరీ ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్ ఆధ్వర్యంలో లైబ్రరీ మరియు నాలెడ్జ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మానవ మేధస్సుకు పుస్తకాలు ఎంతో దోహదం చేస్తాయని, గ్రంథాలయాల్లోని జ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు ముకుందం, ఫర్జానా, దుర్గం కృష్ణ, శేఖర్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మరిపెడలో అక్రమ రేషన్ బియ్యం గుట్టురట్టు

డబుల్ బెడ్‌రూమ్ ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన బియ్యం స్వాధీనం
దాదాపు 230కు పైగా బస్తాలు సీజ్ చేసిన పోలీసులు
ముగ్గురు బడా బాబుల ప్రమేయంపై అనుమానాలు
కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం



**మానుకోట జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** మహబూబాబాద్ జిల్లా మరిపెడలో అక్రమ రేషన్ బియ్యం నిల్వ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని కేంద్రంగా చేసుకుని పెద్ద ఎత్తున అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన అధికారులు ఇంటిలో నిల్వ ఉంచిన దాదాపు 230కు పైగా బియ్యం బస్తాలను సీజ్ చేశారు. ఈ బియ్యం అక్రమ రవాణా లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలించే ఉద్దేశంతో నిల్వ చేసినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో ముగ్గురు బడా బాబుల ప్రమేయం ఉన్నట్లు సమాచారం వెలుగులోకి రావడంతో కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సంబంధిత వ్యక్తుల పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరు ఇందులో భాగస్వాములు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ రేషన్ బియ్యం దందాపై మరిన్ని వివరాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

355 పడకల ఆస్పత్రి నిర్మాణానికి అదనపు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులతో సమన్వయం
నూతన ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, రామగుండం, మే 15( వార్త సంధ్య) :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. రామగుండం లో నిర్మాణంలో ఉన్న 355 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రారంభంలో రూ.160.3 కోట్లతో ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.205 కోట్ల వ్యయం అవసరమవుతోందని తెలిపారు. అదనపు నిధుల మంజూరు కోసం సవరించిన అంచనాలతో ఇప్పటికే సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన అదనపు నిధుల మంజూరు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా సమన్వయం చేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలి



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన పోక్సో కేసుపై సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా, పీడీఎస్‌యూ, పీవైఎల్, టీయూసీఐ, ఏఐయూకేఎస్, ఏఐపీకేఎంఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ మాట్లాడుతూ, కేసుపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని, కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను తొలగించాలని కోరారు. బాధిత మైనర్ బాలికకు రక్షణ, న్యాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో భూ మాఫియా వికృతం..!



చెరువులు.. పంట కాలువలు.. అంగన్‌వాడీ స్థలాలు సైతం కబ్జా!
మూడు సంవత్సరాల్లో విద్యానగర్ భౌగోళిక స్వరూపమే మారిపోయిందన్న ప్రజల ఆవేదన
గ్రీన్‌ల్యాండ్ చెరువులకు అనుసంధానమైన పంట కాలువలను మట్టితో పూడ్చేస్తున్నారన్న ఆరోపణలు
చెరువులను ప్లాట్లుగా మార్చి భారీగా అక్రమ వెంచర్లు వేస్తున్న భూ మాఫియా
అంగన్‌వాడీ కేంద్రాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలపై కూడా కన్నేసిన ఆక్రమణదారులు
నీటి పారుదల మార్గాలు మూసుకుపోవడంతో భవిష్యత్తులో ముంపు ప్రమాదం తప్పదంటున్న స్థానికులు
రెవెన్యూ మున్సిపల్ ఇరిగేషన్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ ప్రజల ఆగ్రహం

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** పట్టణ పరిధిలోని విద్యానగర్ కాలనీలో భూ మాఫియా ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చ నీయాంశంగా మారాయి. ప్రభుత్వ భూములు, చెరువులు, పంట




కాలువలు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు కూడా అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గ్రీన్‌ల్యాండ్ చెరువులకు అనుసంధానంగా ఉన్న పంట కాలువలను మట్టితో పూడ్చి ప్లాట్లుగా మారుస్తున్నారని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం మూడు సంవత్సరాల క్రితం వరకు ప్రాంతంలో సహజ నీటి ప్రవాహ మార్గాలు, చెరువులు స్పష్టంగా కనిపించేవని, ప్రస్తుతం వాటి స్థానంలో అక్రమ వెంచర్లు, కాంక్రీట్ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు. వర్షపు నీరు వెళ్లే మార్గాలను పూర్తిగా మూసివేయడంతో రాబోయే రోజుల్లో కాలనీలు నీట మునిగే పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నారు. "ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు.. రాత్రికి రాత్రే ప్లాట్లు" అన్నట్టుగా పరిస్థితి తయారైందని స్థానికులు మండిపడుతున్నారు. కొన్ని చోట్ల ఎటువంటి అనుమతులు లేకుండానే మట్టిని తరలించి చెరువులను పూడ్చేస్తున్నారని, భారీ యంత్రాలతో పనులు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే చిన్నారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించిన స్థలాలు కూడా ఆక్రమణల ముప్పులో ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ అవసరాల కోసం రిజర్వ్ చేసిన స్థలాలను సైతం ప్రైవేటు వ్యక్తుల పేరిట మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాంత ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు కనిపించడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక సర్వే నిర్వహించి అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువులు, కాలువలు, ప్రభుత్వ స్థలాలను రక్షించకపోతే విద్యానగర్‌లో పర్యావరణ విపత్తు తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## ప్రయాణికులకు ఇబ్బంది కలగద్దు

రైల్వే పోలీసులకు బీఎస్పీ నేత తాండ్ర వెంకటేశ్వర్లు వినతి
భద్రాచలం రోడ్ రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకు వినతి పత్రం
టూ వీలర్ల విషయంలో సామాన్య ప్రజలపై సానుభూతితో వ్యవహరించాలని విజ్ఞప్తి
రిజర్వేషన్, ట్రైన్ టైమ్‌లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల ప్రస్తావన
భద్రతా చర్యల్లో భాగంగా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని పిలుపు
స్టేషన్ ఆర్చికి కొద్దిదూరంలో వాహనాలు పార్క్ చేయాలని సూచన

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సామాన్య ప్రజలు,



ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూడాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జోన్ ఇన్‌చార్జి తాండ్ర వెంకటేశ్వర్లు రైల్వే పోలీసులను కోరారు. ఈ మేరకు భద్రాచలం రోడ్ రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తాండ్ర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారని తెలిపారు. ట్రైన్ ఎక్కించడానికి, రిజర్వేషన్ చేయించుకోవడానికి, పార్సిల్ సేవల కోసం అనేక మంది ప్రజలు స్టేషన్‌కు వస్తుంటారని చెప్పారు. అలాంటి సమయంలో కొద్ది నిమిషాల పాటు టూ వీలర్లు నిలిపే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ట్రైన్ టైమ్‌లలో, రిజర్వేషన్ సమయాల్లో ప్రజలు ఆందోళనలో ఉంటారని, అటువంటి సమయంలో రైల్వే పోలీసులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు నుంచి పది నిమిషాల పాటు వాహనాలు నిలిపిన వారిపై కఠినంగా కాకుండా సానుభూతితో చూడాలని కోరారు. అదే సమయంలో ప్రజ లకు కూడా ఆయన సూచనలు చేశారు.

ఓ స్టేషన్‌కు ఎదురుగా కాకుండా స్టేషన్ ఆర్చికి కొద్దిదూరంలో, ఎవరికి ఇబ్బంది కలగని విధంగా తమ టూ వీలర్లను పార్క్ చేయాలని కోరారు. దేశంలో చోటుచేసుకుంటున్న భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైల్వే భద్రతా వ్యవస్థకు ప్రజలు సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పునూరి నాగయ్య, ప్రధాన కార్యదర్శి జిల్లాల పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కష్టాలు

దళారుల దందాకు ప్రభుత్వమే కారణమా..?
ధాన్యం అమ్ముకోలేక రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే రైతుల నిరీక్షణ
మద్దతు ధరలు కాగితాలకే పరిమితం..
ప్రభుత్వంపై టీడీపీ నేత కనగాల అనంతరాములు తీవ్ర విమర్శలు..

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** పాల్వంచ పరిధిలోని వేటచెరువు, బంగారుజాలు, శ్రీనివాస కాలనీ, గుడిపాడు, కొత్తూరు, పిల్లవాగు తదితర గ్రామాల రైతుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి రైతులు పడిగాపులు కాస్తుండగా, ప్రభుత్వం మాత్రం సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు అకాల వర్షాల భయం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలుగా పేరుకుపోయినా, కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో రైతులు రాత్రింబవళ్లు అక్కడే కాపలా కాస్తున్నారు. తాగునీరు, నీడ, సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితిని పరిశీలించేందుకు గురువారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కనగాల అనంతరాములు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతు ప్రభుత్వం అంటూ ప్రచారం చేసుకుంటున్న పాలకులు క్షేత్రస్థాయిలో రైతులను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు.

### "90 శాతం ధాన్యం దళారుల చేతికే"



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయక పోవడంతో రైతుల వద్ద ఉన్న ధాన్యంలో దాదాపు 90 శాతం వరకు ప్రైవేట్ దళారులు అతి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర రైతుకు అందడం లేదని, మధ్యవర్తులే లాభపడుతున్నారని అన్నారు. "పత్రికల్లో ప్రకటనలుడ సభల్లో హామీలుడ కానీ రైతు చేతిలో మాత్రం నష్టాలే మిగులుతున్నాయి" అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి వేచి చూస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

### అప్పుల ఊబిలో రైతులు..

వరి, మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులతో అప్పులపాలయ్యారని, ఇప్పుడు పండించిన ధాన్యానికి సరైన ధర లేక మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్నారని తెలిపారు. తక్కువ ధరలకు ధాన్యం అమ్ముకుని రైతులు దళారుల చేతిలో మోసపోతుంటే ప్రభుత్వం మౌనంగా చూస్తోందని ఆరోపించారు.

### "అధికారుల పరిశీలనలు ఫోటోలకేనా..?"

కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తున్నామని చెబుతున్నప్పటికీ, రైతులకు ఉపయోగపడే చర్యలు మాత్రం కనిపించడం లేదన్నారు. అధికారుల పరిశీలనలు కేవలం ఫోటోలు, ప్రచారానికే పరిమితమయ్యాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### "రైతు ఓటుతో గెలిచిడ రైతునే మోసం చేస్తున్నారా..?"

రైతులకు అండగా ఉంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు అదే రైతును కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయించే పరిస్థితికి తీసుకువచ్చిందని కనగాల అనంతరాములు విమర్శించారు. రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి భవిష్యత్తులో రైతులే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ డైరెక్టర్ జరబన్న సీతారాములు, కొంటెముక్కుల శ్రీనివాసరావు, గంగవరపు సుధాకర్ తదితరులు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు.

### వెంటనే చర్యలు తీసుకోవాలి..

రైతుల ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి, ప్రకటించిన మద్దతు ధర పూర్తిగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రైతు ఆగ్రహం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## నూతన పర్సనల్ మేనేజర్ కు బీసీఓబీసీ అసోసియేషన్ ఘన సన్మానం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
సంక్షేమంపారదర్శకతతో సమర్థవంతమైన పాలన అందించాలని ఆకాంక్ష
యాజమాన్యంఉద్యోగుల మధ్య వారధిగా అసోసియేషన్ పని చేస్తుంది

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** శుక్రవారం సాయంత్రం బీసీ మరియు ఓబీసీ కొత్తగూడెం ఏరియా అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఏరియా బ్రాంచ్ సెక్రటరీ సకినాల సమ్మయ్య అధ్యక్షతన నూతనంగా పర్సనల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఎల్. తిరుపతి గారిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సకినాల సమ్మయ్య మాట్లాడుతూ, కొత్తగూడెం ఏరియాలో బీసీ మరియు ఓబీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేలా నూతన పర్సనల్ మేనేజర్ తిరుపతి గారు పనిచేయాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా పారదర్శకత, కార్మికులతో సమన్వయం వంటి అంశాల్లో ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తారనే నమ్మకం ఉందన్నారు. అలాగే బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమానికి



అసోసియేషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మరియు ఉద్యోగుల మధ్య వారధిగా పనిచేస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అనంతరామయ్య, మురళి, సందబోయిన శ్రీనివాస్, మెంగని అశోక్, వల్లాల సాంబమూర్తి, పిల్లి భరత్, వాసంపల్లి రాహుల్, లగ్గాల అజయ్, వలబోజు రమేష్ కుమార్, దాసరి రవికాంత్, అమృత జనార్ధన్ రావు, నాలె మల్లికార్జున్, నరసింహమూర్తి, వేల్పుల వినయ్, బింగి గోపాల్, బెజ్జంకి శ్రీనివాస్, కార్తీక్ చంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ భద్రాద్రి జిల్లా కమిటీ అధికారిక ప్రకటన

**రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆదేశాల మేరకు కమిటీ ఖరారు**

**తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యం**

**ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

**జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా కమిటీని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజల్లో బీజేపీపై మరింత విశ్వాసం పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. అలాగే జిల్లా కమిటీలో చోటు దక్కిన నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బీజేపీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు కొత్త కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మణుగూరులో సివిల్ సప్లై డీటీ ఆకస్మిక తనిఖీలు

**ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన.. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

**హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై దాడులు.. ఆరు గ్యాస్ సిలిండర్లు సీజ్**

**డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారాలకు వాడితే కఠిన చర్యలు తప్పవు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో సివిల్ సప్లై డీటీ శివకుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రామాంజవరం, మణుగూరు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, రైతులు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు తూకం, చెల్లింపులు, తరలింపు వంటి అంశాల్లో సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మణుగూరు పట్టణంలోని పలు హోటళ్లు, టిఫిన్ బండ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో అక్రమంగా వినియోగిస్తున్న ఆరు గ్యాస్ సిలిండర్లను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లను వాడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని డీటీ శివకుమార్ హెచ్చరించారు. వంట గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ప్రజా పోరాటాల ద్వారానే పేదల సమస్యల పరిష్కారం

**పార్టీ పటిష్టతకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి**

**ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** ప్రజా పోరాటాల ద్వారానే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండల కౌన్సిల్ సమావేశాలు ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని పేర్కొన్నారు. సమావేశాల్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్ రావు, బొర్రా కేశవరావు, ఊకే నారాయణ, నాగుల్ మీరా, జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల కౌన్సిలింగ్

**మే 16న భద్రాచలం గురుకులంలో బాలురకు కౌన్సిలింగ్**

**మే 18న భద్రాచలం గురుకులంలో బాలికలకు కౌన్సిలింగ్**

**మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు రీజనల్ కోఆర్డినేటర్ బి. అరుణకుమారి**

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 15 (వార్త సంధ్య) :** గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ బి. అరుణకుమారి తెలిపారు. మే 16న భద్రాచలం గురుకులంలో బాలురకు, మే 18న బాలికలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకల్లా కౌన్సిలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. టీసీ, బోనఫైడ్, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికేట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్స్ వెంట తీసుకురావాలని తెలిపారు.

## బాలానగర్ మెట్రో స్టేషన్ వద్ద గంజాయి విక్రేత అరెస్ట్ : 907 గ్రాముల గంజాయి స్వాధీనం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** బాలానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు కూకట్‌పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్.ఐ) వి. తుకారాం తన సిబ్బందితో కలిసి మెట్రో పిల్లర్ నెం. 863 వద్ద గల ఖాళీ ప్రదేశంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్కడ గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న మాదరబోయిన సాయి కుమార్ (24) అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి సుమారు 907 గ్రాముల గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు సాయి కుమార్ ఈ గంజాయిని ఒరిస్సాకు చెందిన పూర్ణచంద్ర అనే వ్యక్తి వద్ద నుండి కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నాడు. ఇక్కడ తనకు తెలిసిన సాయి కృష్ణ, టక్కు అనే వ్యక్తులకు ఎక్కువ ధరకి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.

## రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**మే 20 నాటికి 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం**

**ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో**

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు**

**రవాణా,హమాలీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

**గన్నీ సంచులు తీసుకువచ్చిన రైతులకు ఒక్కో సంచికి రూ.21 చెల్లింపు**

**పెద్దకల్వలలోని అన్నపూర్ణ రైస్ మిల్లుతో పాటు పలు రైస్ మిల్లులను**

**పరిశీలించిన జిల్లా కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 15(వార్త సంధ్య ) :** జిల్లాలో రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తో కలిసి పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని అన్నపూర్ణ రైస్ మిల్లు, పెద్దబొంకూరు లోని రాఘవేంద్ర రైస్ మిల్ తో పాటు పలు రైస్ మిల్లు, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం నిల్వలు, లిఫ్టింగ్, మిల్లింగ్ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,ఫీల్డ్ స్థాయిలో ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు రైస్ మిల్లులను సందర్శిస్తున్నామని తెలిపారు.

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 4 లక్షల నుంచి 4.25 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు 1.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.280 కోట్ల చెల్లింపులు చేశామని తెలిపారు. మరో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వివిధ దశల్లో ఉందన్నారు. రెండో శనివారం, ఆదివారం రోజుల్లో కూడా రైతుల ఖాతాల్లో చెల్లింపులు చేశామని , జిల్లాలో 62 లక్షల గన్నీ సంచులు సిద్ధంగా ఉంచామని చెప్పారు. ఈ ఏడాది వరి దిగుబడి అధికంగా రావడంతో పాటు మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు ఒకేసారి రావడం వల్ల రవాణా, హమాలీ సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. తీవ్ర ఎండల ప్రభావం కూడా ఉందన్నారు. గత వారం వరకు రోజుకు 6 నుంచి 6.5 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగగా, ప్రస్తుతం రోజుకు 13 వేల మెట్రిక్ టన్నుల వరకూ కొనుగోళ్లు పెరిగాయని తెలిపారు. మే 20 నాటికి 80 శాతం కొనుగోళ్లు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు. పీపీసీలకు టార్పాలిన్ కవర్లు అందించామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు సుమారు 700 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినా, ఆ ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతులు సహనంతో ఉండాలని, ప్రతి రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు.జిల్లాలోని 120 మంది రైస్ మిల్లర్లు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ప్రభుత్వానికి సహకరిస్తున్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ యాసంగిలో జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, దిగుబడులు 25 క్వింటాళ్ల నుంచి 35-40 క్వింటాళ్ల వరకూ పెరిగాయని తెలిపారు. ఐదేళ్ల తర్వాత జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతున్నామని, ఇందుకోసం పెద్దపల్లి జిల్లాలో 8 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. రైతులు తమ ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు మొక్కజొన్న తరలించినా రవాణా చార్జీలు చెల్లిస్తున్నామని తెలిపారు. గన్నీ సంచుల కొరత సమస్య పరిష్కారానికి రైతులు స్వయంగా గన్నీ సంచులు తీసుకువస్తే ఒక్కో సంచికి రూ.21 చెల్లిస్తామని తెలిపారు. హమాలీల కూలీ చెల్లింపును ఒక్కో సంచికి రూ.6 నుంచి రూ.8.50కు పెంచామని చెప్పారు.

జిల్లాలో ఎక్కడా కటింగ్‌లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి చెక్ పోస్ట్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. బక్రీద్ పర్వదినం రానున్న నేపథ్యంలో అక్రమంగా ఆవుల రవాణా జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో ఏసిపి జి. కృష్ణ, డీటీ సిఎస్ మహేష్, మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**గ్రౌండింగ్ పూర్తైన ఇందిరమ్మ ఇళ్లకు 5 రోజుల్లోపు శాంక్షన్ ఆర్డర్లు జారీ చేయాలిలి**

**ఉపాధి హామీ పనుల్లో కార్మికుల సమీకరణ పెంచి మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలి**

**ప్రతి మండలంలో 10 నుంచి 15 ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**ఎల్-3 నుంచి ఎల్-1 మార్పులు కచ్చితంగా నిబంధనల ప్రకారమే జరగాలి**

**2బిహెచ్‌కే ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలి**

**ఇందిరమ్మ ఇండ్లు ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 15( వార్త సంధ్య ) :** జిల్లాలో ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనుల అమలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే 25 రోజుల్లో కార్మికుల హాజరు గణనీయంగా పెంచి, మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎంపీడీవోలు ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.నెలాఖరు వరకు ఎక్కువ మంది కార్మికులను సమీకరిస్తే అదనపు కాంపోనెంట్ నిధులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి మండలంలో కనీసం 200 మంది కార్మికులతో ఉపాధి హామీ పనులు నిర్వహించాలని, పాలకుర్తి, ముత్తారం, ఓదెల, సుల్తానాబాద్, పెద్దపల్లి, ధర్మారం మండలాల్లో కనీసం 150 నుంచి 200 మంది వరకు కార్మికుల హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల మధ్య కార్మికుల మొబిలైజేషన్ జరిగేలా చూడాలని, ప్రతి మండలంలో సగటున 305 మంది వరకు హాజరు సాధించే లక్ష్యంతో పని చేయాలని తెలిపారు. కార్మికులు చేసిన పనికి



ఎంత చెల్లింపు వచ్చిందో అదే రోజున స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని మండలాల్లో ఆఫ్ కార్డుల సమస్యలు ఉన్నాయని గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో ప్రధాన పనులు, ఎంఎంఎస్ నమోదు, సగటు హాజరు, అవసరమైన అభివృద్ధి పనులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ముత్తారం, జూలపల్లి, శ్రీరాంపూర్ మండలాల్లో పాడైపోయిన కాలువల పూడికతీత పనులను ప్రాధాన్యతతో చేపట్టి సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్షిస్తూ రద్దు చేసిన ఇళ్లను ఇతర అర్హులైన లబ్ధిదారులకు వేగంగా కేటాయించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం 605 శాంక్షన్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రౌండింగ్ పూర్తిచేసిన ప్రతి ఇంటికి 5 రోజుల్లోపు శాంక్షన్ ఆర్డర్లు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం 10 నుంచి 15 ఇళ్లకు గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎల్-3 నుంచి ఎల్-1కు మార్పుల విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ఫీల్డ్ స్థాయిలో పరిశీలన అనంతరం గెజిటెడ్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే వారం వ్యక్తిగత ఐహెచ్‌హెచ్ఎస్ శాంక్షన్లు జారీ చేయాలని, అవసరమైన చోట చీటా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్లులు జమ అయిన అనంతరం స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్‌కే ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్ పిడి హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు, ఈఈ పీఆర్, హౌసింగ్ ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేయాలి సిపిఎం డిమాండ్



**మంథని, మే 15(వార్త సంధ్య ) :** మంథని మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడైన బండి భగీరథ్ పై గతం వారం రోజుల క్రితం ఫోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం జరిగింది వారం రోజులు గడుస్తున్న ఇప్పటివరకు భగీరథ్ ను ఎందుకు అరెస్టు చేయడం లేదని వారు ప్రశ్నించారు అధికారం మరియు ధన బలాన్ని ఉపయోగించి కేంద్రమంత్రి కొడుకును కాపాడే ప్రయత్నాలు పోలీసు యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.అదే సామాన్యుడైతే ఇదివరకే జైల్లో పెట్టేవారు అను లేకుంటే ఎన్కౌంటర్ పేరుతో చంపేసేవారని మండిపడ్డారు. సామాన్య మానవుడికి ఒకన్యాయం అధికారంలో ఉన్న కేంద్ర మంత్రి కొడుకకు ఒక న్యాయమ అని ప్రశ్నించారు. గతంలో కూడా బండి భగీరథ్ మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్ చేయడం డ్రగ్స్ సేవించడం లాంటి సంఘటనలు ఉన్నాయి అయినప్పటికీ కూడా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంతోనే మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు.ఇప్పటికైనా వెంటనే బండి భగీరథ్ ను అరెస్టు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బండి సంజయ్ ని కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని అలాగే తన కుమారుడు చేసిన దుర్మార్గమైన చర్యకు నైతిక బాధ్యత వహిస్తూ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బండి భగీరథ్ పై చర్యలు తీసుకోవాలని లేకుంటే సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ల సందీప్, గొర్రెంకల సురేష్, మంథని లింగయ్య, తదితరులు పాల్గొన్నారు

## శ్రీరామ్ నగర్ కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తాం - బి.యన్ రెడ్డి మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 15:** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీ ఏర్పరచుకున్న సందర్భంగా బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ని వారి కార్యాలయంలో కలిసి కాలనీ అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలో 90 శాతం వరకు పనులన్నీ పూర్తి చేయడం జరిగిందని మరికొన్ని రోజులలోనే పూర్తి స్థాయిలో కాలనీ అభివృద్ధి మరియు సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాము గౌడ్, ట్రెజరర్ శేఖర్, గౌరవ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పుష్పాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి, రాకేష్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, దయానంద్ గౌడ్, అడ్వైజర్స్ రంగారెడ్డి, రవీందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 15:** డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్.బి.నగర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అడ్డు అదుపు లేకుండా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా ప్రజల తరపున ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల సామాన్య ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతింటోందని, కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఇలాంటి అన్యాయ ధరల పెంపులను అడ్డుకునేందుకు ప్రజలను చైతన్యవంతం చేస్తూ భవిష్యత్తులో కూడా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,మాజీ చైర్మన్లు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, పలు డివిజన్ల అధ్యక్షులు,మహిళ అధ్యక్షురాళ్లు, ఉద్యమకారులు, యువ నాయకులు, మహిళా నాయకులు, వివిధ విభాగాల అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హైదరాబాద్ నలువైపులా 4 'ట్యాంక్‌బండ్‌లు'

**రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు**

**ప్రభుత్వానికి ప్రణాళిక పంపిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

**త్వరలోనే అనుమతి**

**రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో అభివృద్ధి**

**ఆ నాలుగు చెరువులు ఇవే**

**నగరంలో 4 చెరువులు అభివృద్ధి**



పట్టణాభివృద్ధిలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ముందడుగు పడుతోంది. మూసీ సుందరీకరణతో మొదలై నగరంలోని పలు చెరువులకు మునుపటి కళ సంతరించుకునేలా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే ఇటీవల ముఖ్యమంత్రి నగరం నలువైపులా నాలుగు మినీ ట్యాంక్‌బండ్‌లను రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం వాటికి సంబంధించిన పనుల కోసం హైడ్రా రంగంలోకి దిగింది.నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 4 పెద్ద చెరువులను అభివృద్ధి కోసం ఎంపిక చేశారు. ఈ చెరువులను సుమారు రూ.500 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక వేసింది. దానికోసం అనుమతి కోరుతూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రతిపాదనను సమర్పించారు. అనుమతి త్వరలోనే లభిస్తుందని, ఎంపిక చేసిన ఈ నాలుగు చెరువులను రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని హైడ్రా స్పష్టం చేసింది.హైడ్రా పర్యవేక్షణలో ఇప్పటికే ఆరు చెరువులు అభివృద్ధి అయ్యాయని, వాటిలో మూడు చెరువులను ఇప్పటికే ప్రారంభించామని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. "ట్యాంక్‌బండ్ నమూనాలో నాలుగు పెద్ద చెరువులను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి మాకు ఆదేశాలు ఇచ్చారు. మేము ఆ చెరువులను ఎంపిక చేసి, ప్రభుత్వానికి ఒక సమగ్ర ప్రణాళికను సమర్పించాం. దాంట్లో భాగంగానే వివిధ సుందరీకరణ పనులను చేపట్టాం. అలాగే చెరువుల నుంచి మురుగునీటిని శుద్ధి కేంద్రాలకు మళ్లించే కార్యక్రమాన్ని కూడా చేపడతాం." అని రంగనాథ్ పేర్కొన్నారు.నిజాంలు 1897లో జీడిమెట్ల చెరువుకు అడ్డంగా ఒక కట్టను నిర్మించారు. దానినే ఫాక్స్ సాగర్‌గా నేడు పిలుస్తున్నారు. దీని విస్తీర్ణం 482 ఎకరాల్లో ఉంది. ఈ కట్ట యొక్క నిర్మాణ శైలి నేటికీ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సమీప గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చడానికి ఈ చెరువును అప్పుడు అభివృద్ధి చేశారు. ఇది హుస్సేన్‌సాగర్‌తో పాటు మూసీ నదికి ఉపనదిగా ఉండేది. ఆ తర్వాతే మూసీ నదిపై ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించారు. పటాన్‌చెరులో ఉన్న 'అమీన్‌పూర్ పెద్ద చెరువు' జీవవైవిధ్యానికి మారుపేరుగా నిలుస్తోంది. ఇది మొత్తం 453.45 విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు వలస పక్షులకు ఒక ఆశ్రయ కేంద్రంగా ఉంటుంది. ఈ సరస్సు వందలాది రకాల పక్షులు, వృక్షాలు, వివిధ రకాల సీతాకోకచిలుకలు, కీటకాలు ఇతర వన్యప్రాణులకు ఆవాసంగా నిలుస్తోంది.16వ శతాబ్దంలో కులీ కుతుబ్ షా పాలనలో 162 ఎకరాల్లో సరూర్‌నగర్ సరస్సు అభివృద్ధి చేశారు. ఈ సరస్సు త్రాగునీటి అవసరాలను తీర్చడానికి, చుట్టుపక్కల పొలాల్లో వ్యవసాయ సాగుకు మద్దతుగా ఉపయోగపడుతుంది.కూకట్‌పల్లి, ప్రగతి నగర్ మధ్య నెలకొని ఉన్న అంబీర్ చెరువు భారీ రాతి నిర్మాణంతో కమనీయ దృశ్యాన్నిస్తుంది. ఇది మొత్తం 99 ఎకరాల్లో ఉంది. ఇతర సరస్సుల మాదిరిగానే దీని పరిసరాల్లో నివాస సముదాయాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. దాంతో దురదృష్టవశాత్తు ఇది కాలుష్యంతో నిండిన ఒక మురుగు గుంటగా మారిపోయింది.

# హై స్పీడ్ రైలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య)మే 15::** హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు.హైదరాబాద్ పూనే ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ బెంగళూరు కారిడార్, హైదరాబాద్ చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు

# భాగ్యనగరంలో 'అటెన్షన్ డైవర్షన్' దొంగలు

**'అయ్యో' అన్నారో అంతే సంగతులు!**

**ఏమార్చి సెల్‌ఫోన్లు, గొలుసుల దొంగతనాలు**

**బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద వృద్ధులు, అమాయకులే వారి టార్గెట్**

**ఈ తరహా చోరీలకు పాల్పడుతున్న 4 ముఠాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**తీసుకోవాల్సిన జాగ్రత్తలివే , అటెన్షన్ డైవర్షన్‌లో దొంగతనాలు**



ఈ రోజుల్లో దొంగతనాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కేటుగాళ్లు నిరంతరం కొత్త దారులు వెతుక్కుంటున్నారు. అలా దొంగలు ప్రస్తుతం రాజధానిలో అటెన్షన్ డైవర్షన్ అనే పద్ధతిని అనుసరిస్తున్నారు. దీనికి సంబంధించిన ముఠాలను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరి ఈ అటెన్షన్ డైవర్షన్ అంటే ఏంటి? దీని ద్వారా దొంగలు ఎలా కాజేస్తున్నారు? అనే విషయాలను ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.జేబులో నుంచి డబ్బు కింద పడిపోయిందంటారు. నిజమేమో అని మనం అటు తిరగ్గానే సెల్‌ఫోన్ కొట్టేస్తారు. బైక్‌పై నుంచి కింద పడిపోతున్నట్లు నటిస్తారు. 'అయ్యో' అని సాయం చేయటానికి వెళ్తే మెడలోని గొలుసును లాక్కొని వెళ్తారు. దీనినే అటెన్షన్ డైవర్షన్ విధానం అంటారు. ప్రస్తుతం దొంగలంతా దీన్ని అమలు చేసి దొరికిన కాడికి దోచుకుని ఉడాయిస్తున్నారు. ఇటీవల నగరంలో సంచరిస్తూ ముఖ్యంగా ఏటీఎం కేంద్రాల వద్ద ఇటువంటి దొంగతనాలకు పాల్పడుతున్న నాలుగు ముఠాలను పోలీసులు పట్టుకున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మోసగాళ్లు సులభంగా డబ్బు సంపాదించటానికి ఒక మార్గంగా ఈ పద్ధతిని ఎంచుకున్నారు. వారు నగరం లోపల, శివారు ప్రాంతాల్లో ఉన్న బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద మాటు వేస్తారు. నగదు విత్‌డ్రా చేయడానికి లేదా జమ చేయడానికి వచ్చే వారినే ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుంటారు. వారికి మోసపూరిత మాటలు చెప్పి నమ్మిస్తారు. తమకు అత్యవసరంగా నగదు అవసరమని కట్టుకథలు చెప్తారు. మళ్లీ వెంటనే యూపీఐ ద్వారా పంపిస్తామని చెప్పి వారి ఖాతా నుంచి రూ.10 వేలు, రూ.20 వేల వరకు కాజేస్తారు.మోసగాళ్లు బాధితులకు ఒక నకిలీ సందేశాన్ని చూపించి వారి ఖాతాల్లో నగదు జమ అయిందని అబద్ధం చెప్తారు. ఆపై క్షణాల్లోనే అక్కడి నుంచి మాయమైపోతారు. నగదు విత్ డ్రా చేయడానికి వచ్చిన వృద్ధులు, అమాయక వ్యక్తులే వారి ప్రధాన లక్ష్యం. సహాయం చేస్తామనే సాకుతో వారిని సమీపించి, బాధితుల ఏటీఎం కార్డులను తీసుకుంటారు. వారి పిన్ నంబర్లను తెలుసుకుంటారు. బాధితులు కోరిన నగదును విత్‌డ్రా చేసి వారికి అప్పగిస్తారు. ఆ తర్వాత, వారు తమ వద్ద ఉన్న నకిలీ కార్డుతో అసలు కార్డును చాకచక్యంగా మార్చేస్తారు. ఆ తర్వాత బ్యాంక్‌లోని డబ్బును పూర్తిగా దొంగిలిస్తారు.ట్రాఫిక్ జంక్షన్లు, రైల్వే, బస్ స్టేషన్లు, మార్కెట్లు ఇతర రద్దీ ప్రాంతాల్లో ఒకరిద్దరు మహిళలు తరచుగా చిన్న పిల్లలను ఉపయోగించుకుంటూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి దుస్తులకు ఏదో మరక పడిందని లేదా అంటుకుందని చెప్పి బాధితుల దృష్టిని మరల్చుతారు. అలా వారి దగ్గర నుంచి హ్యాండ్‌బ్యాగులు లేదా సెల్‌ఫోన్‌లను లాక్కొని పారిపోతారు. దృష్టి మరల్చడానికి తమలో తామే నకిలీ గొడవలు సృష్టించుకునే ముఠాలు కూడా ఉన్నాయి. దాంతో సంఘటనా స్థలం వద్ద గుమిగూడిన వారి నుంచి విలువైన వస్తువులను దోచుకుంటారు. అంతేకాకుండా ఆటో, రిక్షాలు, సిటీ బస్సుల్లో ప్రయాణికులతో కలిసిపోయి దొంగిలిస్తున్నారు.నగరంలోని రెండు ప్రాంతాలకు చెందిన మహిళల ముఠా ఈ రకమైన దొంగతనాలకు పాల్పడుతోందని అధికారులు గుర్తించారు. వీరిపై నిఘా ఉంచామని, వారి నేర కార్యకలాపాలను అరికట్టడానికి చర్యలు ప్రారంభించామని గోల్కొండ డీసీపీ చంద్రమోహన్ తెలిపారు.ఏటీఎం కేంద్రాల వద్ద అపరిచితులకు నగదు లేదా ఏటీఎం కార్డులు ఇవ్వవద్దని ఆయన ప్రజలకు సూచించారు.అలాగే, ఏదైనా బ్యాంకింగ్ లావాదేవీలు జరిపిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌లకు వచ్చే లావాదేవీల హెచ్చరికలను సరిచూసుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

# మగవాళ్ల ఆత్మహత్యలకు అత్యధిక శాతం అవే కారణాలు

యువకుడికి పాతికేళ్లు నిండాయంటే చాలు వారిపై కుటుంబ బాధ్యతలు, వ్యాపారంలో నష్టాలొస్తే సూటిపోటి మాటలు, రుణ దాతల ఒత్తిళ్లు, నిరుద్యోగం, సవాళ్లతో కూడిన ఉద్యోగ జీవితం, ఆర్థిక సమస్యలతో పురుషులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక మహిళలతో పోలిస్తే 80 శాతం అధికంగా బలవన్మరణాలు చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సమస్య చిన్నదైనా, పెద్దదైనా అన్నింటికీ మరణమే పూర్తి పరిష్కారంగా భావిస్తూ కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు. ఈ మేరకు తాజాగా జాతీయ నేర గణాంక సంస్థ–2024 నివేదికలో తేలింది.హైదరాబాద్‌లో 2024లో ఆత్మహత్యల తీరును ఎన్‌సీఆర్‌బీ విశ్లేషించింది. ఆ సంవత్సరం మొత్తం 711 మంది తనువు చాలించగా, వారిలో 557 మంది పురుషులే ఉన్నారు. అయితే ఈ మృతుల్లో ఎక్కువగా యువత ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకూ తగ్గుతున్న మానవ సంబంధాలు, ఒంటరితనం బలవన్మరణాలకు ప్రధాన కారణంగా మారుతోందని పోలీసులు, మానసిక నిపుణులు చెబుతున్నారు. మారుతున్న ఈ పోటీ ప్రపంచంలో విద్య, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలతో ఒంటరితనం అనుభవిస్తున్నారు. ఇలా ఈ జీవితానికి అలవాటుపడుతున్న యువత చిన్న సమస్యల్ని కూడా పెద్దవిగా అనుకుంటున్నారు. తీరా వీటిని పరిష్కరించుకోలేని పరిస్థితి వస్తే దానికి ప్రత్యామ్నాయం చూడకుండా లోకాన్ని వీడాలనే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక యువకుల విషయానికొస్తే తన బాధను ఎవరితోనూ చెప్పుకోలేక, వారిలోనే దాచుకుని సతమతమవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారిని కొన్ని లక్షణాల ద్వారా ముందే గుర్తించొచ్చని నిపుణులు చెబుతున్నారు.అందరితో కలివిడిగా ఉండే వ్యక్తులు ఒక్కసారిగా ముభావంగా ఉండటం. ఎక్కువ సమయం ఒంటరిగా గడపడం వంటివి చేస్తుంటారు.ఇతరులతో మాట్లాడేందుకు ఎక్కువగా ఇష్టపడకపోవడం.సోషల్ మీడియాల్లో ఆత్మహత్యల గురించి వెతకడం.ఆత్మహత్య చేసుకోవడానికి అనువైన ప్రాంతాల గురించి వెతకడం, దానికి అవసరమైన సామగ్రి సమకూర్చుకోవడం చేస్తుంటారు.అసలు ఈ సమస్యలన్నీ తాత్కాలికమే అయినప్పటికీ నేటి యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనికి పరిష్కారం ఏంటని ఎవరూ ఆలోచించడం లేదు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకొని కుటుంబంలో తీరని విషాదం నింపుతున్నారు. తాజా గణాంకాల్లో ఈ మధ్యకాలంలో ఆత్మహత్యలు చేసుకున్న వారిలో పురుషుల సంఖ్య ఎక్కువని తేలింది. ఏ సమస్యనైనా ఎదుర్కొనే స్వభావం అబ్బాయిలకు ఉంటుంది అంటారు. కుటుంబానికి అండదండగా ఉండి, రక్షణ కల్పించాల్సిన వారే అనుకోకుండా ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో కుటుంబంలోని తల్లితండ్రులు, పిల్లల తలరాతలు చిందరవందర అవుతున్నాయి. అకస్మాత్తుగా తీసుకునే ఈ నిర్ణయాలతో ఎన్నో ఆశలు పెట్టుకున్న కుటుంబాన్ని కలవరంలోకి నెట్టేస్తున్నారు.జీవితమన్నాక ఏదో ఓ సందర్భంలో సమస్యలు రావడం సహజమని, వాటికి సరైన రీతిలో ఆలోచిస్తే పరిష్కారమార్గాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మీకు ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు వచ్చినా, తీవ్ర ఒత్తిడిలో ఉన్నా, మీ సమస్యను ఎవరితోనైనా పంచుకోవాలని అనుకుంటున్నా, మీకు సహకరించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్లు సిద్ధంగా ఉన్నాయి. అందుకోసం స్నేహ ఫౌండేషన్ – 04424640050 (24×7 అందుబాటులో ఉంటుంది) లేదా టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హెల్ప్‌లైన్ – 9152987821కి సంప్రదించవచ్చు. వీరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 – రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటారు. వారిని సంప్రదించి మీ సమస్యలను వివరించవచ్చు. తద్వారా తగిన పరిష్కార మార్గాలను పొందవచ్చు.

# రాష్ట్రంలో జూన్ 25 నుంచి 'సర్' ప్రక్రియ

**సర్వేలో పాల్గొనడానికి వీలుకాకపోతే ఏం చేయాలంటే?**

**తెలంగాణ అవతరించాక మొదటిసారి నిర్వహణ**

**షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం**

**83 లక్షల ఇళ్లకు వెళ్లి సర్వే చేయనున్న బీఎల్‌వోలు**

**అక్టోబరు 1న ఓటర్ల తుది ప్రచురణ**




తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) మూడో దశ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. దానికి సంబంధించిన షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ప్రస్తుతం జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా గృహ గణన నిర్వహిస్తున్న యంత్రాంగాన్ని దృష్టిలో పెట్టుకుని, అదే కార్యక్రమంతో పాటు సర్ మూడో దశ షెడ్యూల్‌ను కూడా ఖరారు చేసింది.తెలంగాణలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో) జూన్ 25 నుంచి జులై 24వ తేదీల మధ్యలో ఇంటింటికీ తిరిగి పరిశీలన చేస్తారు. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌లు మినహాయించి దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాల్లో ఈ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ మూడో దశ కార్యక్రమం కొనసాగుతుంది. ఇది ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులందరి భాగస్వామ్యంతో నిర్వహించే ప్రక్రియ. అందువల్ల అన్ని రాజకీయ పార్టీలు తప్పకుండా ప్రతి పోలింగ్ బూత్‌కూ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాల్సి ఉంటుంది. పార్టీలు పూర్తి స్థాయిలో భాగస్వామ్యమైతే ఈ కార్యక్రమం గొప్ప పారదర్శకతతో నిర్వహించడానికి సులభమవుతుంది అని ఎన్నికల సంఘం పేర్కొంది.ఈ నెలాఖరు నుంచి అక్టోబరు 14వ తేదీ వరకు 16 రాష్ట్రాలు, మూడు యూనియన్ టెరిటరీల్లో 3.94 లక్షల మంది బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్లతో కలుస్తారు. వారికి రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్‌స్థాయి ఏజెంట్లు ఏవైనా సందేహాలుంటే సహకారం అందిస్తారు. ఇప్పటివరకు తొలి రెండు దశలను 59 కోట్ల ఓటర్లున్న 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తే, అందులో 6.3 లక్షల మంది బూత్ స్థాయి అధికారులు, 9.2 లక్షల మంది బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారని ఎన్నికల సంఘం తెలిపింది.తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, హరియాణా, ఝార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్. కేంద్రపాలిత ప్రాంతాలు ఇవే దిల్లీ, చండీగఢ్, దామన్‌దీవు, దాద్రానగర్ హవేలీ.ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2002లో ఎస్ఐఆర్ సర్వే నిర్వహించారు. కానీ ఇది తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత మొదటిసారి చేపట్టబోతున్నారు. ఇప్పటికే అధికారులు 2002 నాటి, తాజా ఓటర్ల జాబితాలను బీఎల్‌వోలకు అందించడం పూర్తి చేశారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు రెండు గణనపత్రాలను అందిస్తారు. పూర్తి చేసిన ఒక పేపర్‌ను తీసుకుని, రెండోది ఓటరుకు రసీదు కింద ఇస్తారు. ఓటర్లు గణనపత్రాలను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులను సైతం బీఎల్‌వోలు ఇంటింటి సర్వేకు వెళ్లినప్పుడు ధ్రువీకరణ చేస్తారు.తెలంగాణలో ఈ నెల 12వ తేదీ వరకు 3,39,20,705 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. 35,985 మంది బీఎల్‌వోలు, 25,886 మంది బీఎల్‌ఏలు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నారు. మొత్తం 33 జిల్లాల్లోని 13 కార్పొరేషన్లు, 129 పట్టణాలు, 12,769 గ్రామపంచాయతీల వివరాలను డిపార్టుమెంట్ల వారీగా అధికారులు గుర్తించి పెట్టుకున్నారు. రాష్ట్రంలోని సుమారు 83.04 లక్షల కుటుంబాల వద్దకు వెళ్లి బీఎల్‌వోలు సర్వే చేస్తారు. వారు వెళ్లినప్పుడు తాళం ఉంటే కనీసం మూడుసార్లు ఆ ఇంటిని సందర్శించాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది.సర్వే సమయంలో ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోలేకపోతే, అనుకోని కారణాలతో పాల్గొనలేకపోతే జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఉండే అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో ఫాం–6 సమర్పించి తమ పేరును నమోదు చేసుకునే అవకాశం ఉంది. కొత్త ఓటరు కూడా ఇదే ఫారాన్ని నింపాల్సి ఉంటుంది.నకిలీ, చనిపోయిన వారు, శాశ్వతంగా తరలిపోయిన వారు, అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి అర్హుల పేర్లను మాత్రమే ఉండేలా పారదర్శకంగా చూడటం.బీఎల్‌వోలు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్తారు. ఓటర్లు భర్తీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను పాత ఓటరు డేటాతో పోల్చి చూసి సరిగ్గా ఉంటే నమోదు చేసుకుంటారు.రాష్ట్రంలోని సుమారు 83.04 లక్షల కుటుంబాల వద్దకు వెళ్లి బీఎల్‌వోలు సర్వే నిర్వహిస్తారు. అధికారులు వెళ్లినప్పుడు ఇంటికి తాళం వేసి ఉంటే కనీసం మూడుసార్లు ఆ ఇంటిని సందర్శిస్తారు.

# మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**మన బడి- మన భవిష్యత్తు' ఏర్పాటుకు ఉత్తర్వులు**

**ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు**

**స్కూల్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ సొసైటీ ' ఏర్పాటుకు ఉత్తర్వులు**

**దాతల కోసం డోనర్ పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్న ప్రభుత్వం**



ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో 'మన బడి – మన భవిష్యత్తు' (మన పాఠశాల – మన భవిష్యత్తు) కార్యక్రమం కింద 'ఏపీ స్కూల్ ఇన్‌ఫ్రాడెవలప్‌మెంట్ సొసైటీ'ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సొసైటీతో పాటు దాతల కోసం ప్రత్యేకంగా ఒక 'డోనర్ పోర్టల్' ప్రారంభించనుంది.కార్యక్రమాలు, ఎన్నారైలు, పూర్వ విద్యార్థుల సంఘాలు, వ్యక్తిగత దాతల నుంచి విరాళాలు సేకరించి, ఆ నిధులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని మౌలిక సదుపాయాల లోటును పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ప్రారంభించనుంది. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిని సొసైటీ ఛైర్మన్‌గా, పాఠశాల మౌలిక సదుపాయాల కమిషనర్‌ను కార్యదర్శిగా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను వైస్–ఛైర్మన్‌గా, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల కమిషనర్లతో పాటు ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్‌ను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.నిధుల నిర్వహణను సులభతరం చేయడానికి 'రాష్ట్ర కార్యక్రమం' 'పాఠశాల కార్యక్రమం'గా పేర్కొంటూ రెండు బ్యాంకు ఖాతాలు సొసైటీ పేరు మీద తెరిచారు. అంతేకాకుండా దాతలను ప్రోత్సహించడానికి ఈ సొసైటీకి ఇచ్చే విరాళాలు 100% ఆదాయపు పన్ను మినహాయింపుకు అర్హత పొందేలా చర్యలు అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేసవి సెలవుల సమయంలో పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 'మన బడి – మన భవిష్యత్తు' అనే కార్యక్రమం కింద, ఈ పనులను మూడు ప్రాధాన్యతా విభాగాలుగా వర్గీకరించారు. ఈ మూడు విభాగాలకు సంబంధించిన పనులను పూర్తి చేయడానికి రూ. 2,726.6 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 'ఆదర్శ ప్రాథమిక పాఠశాలల'లో తొమ్మిది రకాల సదుపాయాలను, ఇతర పాఠశాలల్లో ఐదు రకాల సదుపాయాలను కల్పించనున్నారు.ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య ఎక్కువగా ఉన్నట్లయితే మాత్రమే అదనపు తరగతి గదులను నిర్మిస్తారు. గత ప్రభుత్వ హయాంలో రెండో దశ కింద చేపట్టిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ పాఠశాలల్లో ఐదు రకాల సదుపాయాలను కల్పించనున్నారు. ఈ విభాగం కిందకు వచ్చే 14,000కు పైగా పాఠశాలల్లో పనులను పూర్తి చేయడానికి సుమారు రూ. 1,000 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఈ నిర్దిష్ట విభాగాల పరిధిలోకి రాని మరో 12,000కు పైగా పాఠశాలల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పాఠశాలల్లో నిధుల లభ్యత – స్థానిక అవసరాల ఆధారంగా సదుపాయాలను కల్పిస్తారు. అన్ని పాఠశాలల్లో తాగునీరు, పారిశుధ్య (మరుగుదొడ్ల) సదుపాయాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారమయ్యేలా తగిన చర్యలు తీసుకుంటారు.విద్యార్థుల నమోదు సంఖ్య 120కి మించి ఉన్న 'ఆదర్శ ప్రాథమిక పాఠశాలల'లో కొత్తగా అదనపు తరగతి గదులను నిర్మిస్తారు.రాష్ట్రవ్యాప్తంగా 4,325 పాఠశాలల్లో, అదనపు గదుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న గదులను రెండుగా విభజించడం, వరండాలను తరగతి గదులుగా మార్చడం వంటి పనులు చేపడతారు.1,913 పాఠశాల భవనాలకు చిన్న, పెద్ద మరమ్మతులు నిర్వహించబడతాయి. 2,046 పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మిస్తారు.2,561 పాఠశాలల్లో విద్యుదీకరణ పనులు అంటే ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల అమరికతో సహా పూర్తి చేస్తారు. అదే సమయంలో 3,325 పాఠశాల భవనాలకు రంగులు వేస్తారు. 3,157 పాఠశాలల్లో ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. 3,371 చోట్ల ఆకుపచ్చ రంగు నల్లబల్లలు సమకూర్చుతారు. 2,807 పాఠశాలలకు ఫర్నిచర్ సరఫరా చేస్తారు. ఈ కార్యక్రమాలకు అయ్యే అంచనా వ్యయం రూ. 571.13 కోట్లు.

## హైబీపీ ఉంటే ఈ లక్షణాలను లైట్ తీసుకోవద్దు గుండెపోటుకు సంకేతం కావచ్చు



అధిక రక్తపోటు ఉన్న రోగులలో గుండెపోటు ప్రమాదం ఇతరుల కంటే ఎక్కువగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీ రక్తపోటు మీ వయస్సు కంటే ఎక్కువగా ఉంటే, గుండెపోటు ఈ ప్రారంభ సంకేతాలను చిన్నవిగా పరిగణించే పొరపాటు చేయకండి.. ఎందుకంటే.. ఇవి ప్రాణాంతకంగా మారవచ్చు.. కావున ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి.. పపంచవ్యాప్తంగా వణికిస్తోన్న సైలెంట్ కిల్లర్ డిసీజ్.. హైపర్ టెన్షన్.. అదే హైబీపీ (అధిక రక్తపోటు).. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం కోట్లాది మంది ఈ హైపర్‌టెన్షన్ సమస్యతో బాధపడుతున్నారు. తలనొప్పి, ఆకస్మిక తలతిరుగుడు, ఊపిరి ఆడకపోవడం లేదా ఛాతీ నొప్పి వంటి సమస్యలు పెరుగుతున్నట్లయితే.. మీరు అధిక రక్తపోటు రోగి అయి ఉండవచ్చు. అయితే, ఈ లక్షణం వేరే వ్యాధి వల్ల కూడా రావచ్చు.. కావున వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. దీనితో పాటు, మీరు ఇంట్లోనే బిపి కొలిచే యంత్రంతో మీ బీపీ (రక్తపోటు) ని కూడా తనిఖీ చేసుకోవచ్చు. సిస్టోలిక్ పీడనం 180 కంటే ఎక్కువగా ఉన్నప్పుడు లేదా డయాస్టొలిక్ పీడనం 110 లేదా అంతకంటే ఎక్కువకు చేరుకున్నప్పుడు.. హైబిపి నుండి గుండెపోటు వచ్చే ప్రమాదం ఏర్పడుతుంది. 18 నుంచి 65 సంవత్సరాల వయస్సు గల పెద్దల రక్తపోటు 120/80%ఎఎ ఎస్త్ర% కంటే తక్కువగా ఉండాలి. మీ రక్తపోటు 130/80 %ఎఎ ఎస్త్ర% అయితే, జాగ్రత్తగా ఉండండి. ముఖ్యంగా ఈ లక్షణాలు కనిపించిన వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి.

### అధిక రక్తపోటు గుండెకు ఎందుకు ప్రమాదకరం?..

బిపి అనేది శరీరంలోని అన్ని భాగాలను చేరుకోవడానికి రక్తం ఉపయోగించే ఒక రకమైన పీడనానికి సంబంధించినది. అటువంటి పరిస్థితిలో, అధిక రక్తపోటు కారణంగా, గుండెకు తగినంత విశ్రాంతి లభించదు. దీని కారణంగా హృదయ స్పందన పెరగడం ప్రారంభమవుతుంది.. ధమనులు బలహీనపడటం వలన, గుండెపోటు, స్ట్రోక్, గుండె వైఫల్యం వంటి ప్రాణాంతక పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉంది.

### బిపి రోగులలో గుండెపోటు లక్షణాలు ఇవే..

ఛాతీ నొప్పి ఛాతీలో భారం %-% బిగుతుగా ఉండటం: గుండెపోటుకు ముందు తీవ్రమైన ఛాతీ నొప్పి అత్యంత సాధారణ లక్షణం. సాధారణంగా ఈ నొప్పి ఛాతీ మధ్యలో లేదా ఎడమ వైపున అనుభూతి చెందుతుంది. ఈ నొప్పి ఛాతీలో భారంగా.. బిగుతుగా అనిపించవచ్చు.

### గుండెపోటు నొప్పి ఎక్కడ వస్తుంది?

అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం.. మీ చేతులు, మెడ, దవడ, కడుపులో నొప్పి లేదా అసౌకర్యం అనిపిస్తే, అది గుండెపోటుకు హెచ్చరిక సంకేతం కావచ్చు..

### ఈ విషయాలను కూడా గుర్తుంచుకోండి.

ఛాతీ నొప్పి ఉన్నా లేకపోయినా, శ్వాస ఆడకపోవడం అనేది గుండెపై ఒత్తిడికి సంకేతం కావచ్చు. దీనితో పాటు, వికారం, తలతిరుగుతున్న భావన కూడా గుండెపోటు లక్షణాలే.. కావున ఇలాంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్తగా ఉండాలని.. వెంటనే వైద్యులను సంప్రదించాలని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

## సూపర్ ఫుడ్ అవిసె గింజల్లోని పోషకాల గురించి తెలుసా?



అవిసె గింజలను సూపర్ ఫుడ్‌గా, ఫంక్షనల్ ఫుడ్‌గా చెబుతారు. అంటే.. ఈ గింజలు పోషకాహారంగా మాత్రమే కాకుండా ఔషధ గుణాలు కలిగి ఉండి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్న మాట. సాధారణ ధాన్యాలు కేవలం ఆకలిని తీర్చటానికే పరిమితమవుతాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ పశ్చిమబెంగాల్ బారక్‌పూర్‌లోని కేంద్రీయ జనపనార, ఇతర నార ఉత్పత్తుల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్%-%సీఆర్ఐజేఏఎఫ్) శాస్త్రవేత్తల సమాచారం ప్రకారం అవిసె గింజల్లో పోషక, ఔషధ విలువలు ఇలా ఉన్నాయి: అవిసె గింజల్లో 35%-%43% కొవ్వు ఆమ్లాలు, 18%-%21% మాంసకృత్తులు, 25%-%28% డయటరీ ఫైబర్, 1%-%2% పిండిపదార్థాలు ఉంటాయి. ఒమెగా 3 కొవ్వు ఆమ్లం, ఎఎల్ఎ, లినోలీక్ ఆమ్లం(ఎల్ఎ), ఎసెన్షియల్ విటమిన్లు, అమినో ఆమ్లాలు, స్థూల%-%సూక్ష్మ మూలకాలు, లిగ్నాన్లు, ఫ్లావనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అత్యధిక మొత్తంలో పాలిఅన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు (పీయూఎఫ్ఏలు), ముఖ్యంగా ఎఎల్ఎలు, ఉంటాయి కాబట్టి అవిసె గింజలు ఆరోగ్యదాయకమైన అనుబంధాహారంగా ప్రాచుర్యం ?పొందాయి.. ఎఎల్ఎ, లిగ్నాన్లు పుష్కలంగా ఉండటం మూలంగా అవిసె గింజలు గుండెకు మేలు చేస్తాయి. రక్తపోటును తగ్గిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ రోగుల్లో ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలను, ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. అవిసె గింజల్లోని యాంటీఆక్సిడెంట్లు కేన్సర్‌ను నిరోధిస్తాయి.మెనోపాజ్ ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. మలబద్ధకం, మానసిక అలసటను తగ్గిస్తాయి. చర్మ ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. గాయాలను త్వరగా మానేలా చేస్తాయి. అవిసె గింజల పిండిని అనేక అనారోగ్యాలను తగ్గించడానికి అనాదిగా వాడుతున్నారు. అయితే, శ్యానోజెనిక్ గ్లైకోసైడ్స్, ట్రిప్సిన్ ఇన్‌హిబిటర్స్, ఫైటిక్ ఆసిడ్ వంటి యాంటీ న్యూట్రియంట్లు ఉన్నప్పటికీ.. మొత్తంగా చూస్తే అవిసె గింజలను ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు నెరవేరతాయి. అందువల్లనే అవిసె గింజలు ఔషధగుణాలున్న పోషక గింజలుగా ప్రసిద్ధి పొందుతున్నాయి.అవిసె నార ఉత్పత్తి కన్నా అవిసె గింజల ఉత్పత్తికి మన దేశ వాతావరణం అనుకూలమైనదని ఐసీఏఆర్%-%సీఆర్ఐజేఏఎఫ్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూరప్ దేశాల నుంచి అవిసె గింజలను దిగుమతి చేసుకోవటం వల్ల విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశం నష్ట?తోంది. ఓఈసీ గణాంకాల ప్రకారం భారత్ ఫ్లాక్స్ ఫైబర్ దిగుమతులు 2016లో 3.15 కోట్ల డాలర్ల నుంచి 2021 నాటికి 9.45 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఫ్లాక్స్ ఫైబర్‌ను మనం పండిస్తున్న దానికీ, మన అవసరాలకు పెద్ద అగాధం ఉంది. అంటే, ఫ్లాక్స్ ఫైబర్ సాగును దేశీయంగా పెంచుకోవటానికి గల అవకాశాలను ఇది సూచిస్తోంది. అయితే, గింజల కోసం ఒక పంట, నార కోసం మరో పంట కాకుండా.. రెండిటి కోసమూ ఒకే పంటను పండించుకుంటే ఈ కొరతను తీర్చుకోవటం వీలవుతుంది. భారతీయ పరిస్థితులకు తగిన మేలైన నార అవిసె రకాలను అభివృద్ధి చేసుకోవటం ద్వారా ఫ్లాక్స్ ఫైబర్ ఉత్పత్తిలో మనం స్వయంసమృద్ధి సాధించవచ్చు. ఈ సవాలును అధిగమించేందుకు అనువైన వంగడాలను 2015లోనే జెఆర్ఎఫ్%-%2 (తైర)ను ఐసీఏఆర్%-%సీఆర్ఐజేఏఎఫ్ శాస్త్రవేత్తలు విడుదల చేశారు. సాగు పెంచాలంటే చెయ్యాల్సిన మరో పని ఏమిటంటే.. మన దేశంలో వేడిగా, తేమగా ఉండే వాతావరణాల్లో చక్కగా పెరిగే అవిసె నార పంట సాగుకు అనువైన వంగడాలను రూపొందించుకోవటం ముఖ్యం. రైతులు తొలిగా సాగు చేసిన పంటల్లో ఒకటైన అవిసెకు ఆరోగ్య ప్రయోజనాలు చాలా మెండుగా ఉన్నాయి. ఈ గింజలతో వంట నూనె తయారు చేసుకోవచ్చు. ఔషధ గుణాలతో కూడిన ఆహారోత్పత్తులు చేసుకోవచ్చు. గానుగ పిండి పశుదాణాగా పనికొస్తుంది. కాండం పీచుతో వస్త్రాలను తయారు చేసుకోవచ్చు. ప్రపంచ అవిసె ఉత్పత్తి గతంలో కన్నా క్షీణించినప్పటికీ.. దీని సహజ ఆరోగ్యకర ఉత్పత్తుల ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై పెరిగిన అవగాహన వంటి కారణాల రీత్యా అవిసె పంట తిరిగి పుంజుకోవడానికి అవకాశాలున్నాయి. ఉన్నతమైన అవిసె వంగడాలను అభివృద్ధి చేయడానికి అధునాతన బయోటెక్నాలజీ పద్ధతులను శాస్త్రవేత్తలు ఉపయోగిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో అవిసె 'అద్భుత పంట'గా తన ఖ్యాతిని మరింత మిన్నగా కొనసాగిస్తుందని ఆశిద్దాం.అబ్జర్వేటరీ ఆఫ్ ఎకనామిక్ కాంప్లెక్సిటీ 2021 గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 134 కోట్ల డాలర్ల లిన్‌సీడ్ వాణిజ్యం జరిగింది. రష్యా, కెనడా, కజకిస్తాన్ ఎగుమతిలో ముందంజలో ఉన్నాయి. బెల్జియం, చైనా, అమెరికా ఎక్కువగా దిగుమతి చేసుకున్నాయి. 2021లో మన దేశం 1.35 కోట్ల డాలర్ల అవిసె గింజలను ఎగుమతి చేసింది. ప్రపంచ మార్కెట్‌లో ఇది 1%. అదే సంవత్సరం 1.53 లక్షల డాలర్ల విలువైన అవిసె గింజలను విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకున్నాం. 2021లో 98.5 కోట్ల డాలర్ల ముడి అవిసె నార వాణిజ్యం జరిగింది. ఫ్రాన్స్, బెల్జియం, అమెరికా, బెలారస్ ఎక్కువగా ఎగుమతి చేశాయి. చైనా, బెల్జియం, భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకున్నాయి.అవిసె నార ఉత్పత్తి కన్నా అవిసె గింజల ఉత్పత్తికి మన దేశ వాతావరణం అనుకూలమైనదని ఐసీఏఆర్%-%సీఆర్ఐజేఏఎఫ్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూరప్ దేశాల నుంచి అవిసె గింజలను దిగుమతి చేసుకోవటం వల్ల విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశం నష్ట?తోంది. ఓఈసీ గణాంకాల ప్రకారం భారత్ ఫ్లాక్స్ ఫైబర్ దిగుమతులు 2016లో 3.15 కోట్ల డాలర్ల నుంచి 2021 నాటికి 9.45 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఫ్లాక్స్ ఫైబర్‌ను మనం పండిస్తున్న దానికీ, మన అవసరాలకు పెద్ద అగాధం ఉంది. అంటే, ఫ్లాక్స్ ఫైబర్ సాగును దేశీయంగా పెంచుకోవటానికి గల అవకాశాలను ఇది సూచిస్తోంది. అయితే, గింజల కోసం ఒక పంట, నార కోసం మరో పంట కాకుండా.. రెండిటి కోసమూ ఒకే పంటను పండించుకుంటే ఈ కొరతను తీర్చుకోవటం వీలవుతుంది. భారతీయ పరిస్థితులకు తగిన మేలైన నార అవిసె రకాలను అభివృద్ధి చేసుకోవటం ద్వారా ఫ్లాక్స్ ఫైబర్ ఉత్పత్తిలో మనం స్వయం సమృద్ధి సాధించవచ్చు. ఈ సవాలును అధిగమించేందుకు అనువైన వంగడాలను 2015లోనే జెఆర్ఎఫ్%-%2 (తైర)ను ఐసీఏఆర్%-%సీఆర్ఐజేఏఎఫ్ శాస్త్రవేత్తలు విడుదల చేశారు. సాగు పెంచాలంటే చెయ్యాల్సిన మరో పని ఏమిటంటే.. మన దేశంలో వేడిగా, తేమగా ఉండే వాతావరణాల్లో చక్కగా పెరిగే అవిసె నార పంట సాగుకు అనువైన వంగడాలను రూపొందించుకోవటం ముఖ్యం.

## లైట్ తీసుకున్నారో ప్రాణాలే పోతాయ్ 5 ప్రమాదకరమైన కాలేయ వ్యాధులు ఇవే



కాలేయం శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాలలో ఒకటి.. ఇది అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. శరీరంలోని విషాలను తొలగిస్తుంది.. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.. రక్తం గడ్డకట్టడాన్ని నియంత్రిస్తుంది.. ప్రోటీన్లను సంశ్లేషణ చేస్తుంది.. ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడే రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది. కాలేయం శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాలలో ఒకటి.. ఇది అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. శరీరంలోని విషాలను తొలగిస్తుంది.. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.. రక్తం గడ్డకట్టడాన్ని నియంత్రిస్తుంది.. ప్రోటీన్లను సంశ్లేషణ చేస్తుంది.. ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడే రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది. జీర్ణక్రియ, నిర్విషీకరణ, జీవక్రియలో ప్రధానమైన కాలేయం అనారోగ్యానికి గురైనప్పుడు లేదా దెబ్బతిన్నప్పుడు, ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమవుతుంది.. అనేక కొత్త వ్యాధులు అభివృద్ధి చెందడం ప్రారంభమవుతుంది.. ఇది జీవితానికి ముప్పు కలిగిస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కూడా కావొచ్చు.. మనం మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటే, మనం కాలేయ ఆరోగ్యాన్ని అన్ని విధాలుగా జాగ్రత్తగా చూసుకోవాలి. అయితే.. ప్రమాదకరమైన 5 కాలేయ వ్యాధులు ఏమిటి..? ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకోండి..

### అత్యంత ప్రమాదకరమైన కాలేయ (లివర్) వ్యాధులు ఇవే..

**లివర్ సిర్రోసిస్:**

సిర్రోసిస్ అంటే కాలేయ కణజాలంపై విస్తృతమైన మచ్చలు ఏర్పడటం.. దీర్ఘకాలిక మద్యపానం లేదా హెపటైటిస్ వంటి పరిస్థితుల వల్ల కలిగే దీర్ఘకాలిక నష్టం దీనికి కారణం.. ఆరోగ్యకరమైన కణాల స్థానంలో మచ్చ కణజాలం రావడంతో, కాలేయ పనితీరు తగ్గుతుంది.. దీని వలన అలసట, వాపు, కామెర్లు.. అంతర్గత రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దాని అధునాతన దశలలో.. సిర్రోసిస్ కాలేయ వైఫల్యం లేదా కాలేయ క్యాన్సర్‌కు దారితీస్తుంది.

**హెపటైటిస్ బి, సి:**

హెపటైటిస్ బి, సి ఈ వైరల్ ఇన్ఫెక్షన్లు కాలేయం వాపునకు కారణమవుతాయి.. వెంటనే చికిత్స చేయకపోతే దీర్ఘకాలిక రూపంలోకి వెళ్ళవచ్చు. దీర్ఘకాలిక హెపటైటిస్ బి లేదా సి కాలేయాన్ని సంవత్సరాల తరబడి నిశ్శబ్దంగా దెబ్బతీస్తుంది.. ఇది సిరోసిస్ లేదా కాలేయ క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఈ రెండు వైరస్‌లు తల్లి నుండి బిడ్డకు సోకిన రక్తం ద్వారా, అసురక్షిత లైంగిక సంబంధం ద్వారా లేదా ప్రసవ సమయంలో వ్యాపిస్తాయి.

**నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ :**

నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్.. క్లుప్తంగా చెప్పాలంటే ఆల్కహాల్ తీసుకోకుండా కాలేయంలో అదనపు కొవ్వు పేరుకుపోయినప్పుడు సంభవిస్తుంది. దీనికి కారణాలు ఊబకాయం, మధుమేహం, సరైన ఆహారం లేకపోవడం. నాన్-ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ (%హీూాం%) అని పిలువబడే దాని తీవ్రమైన రూపంలో.. ఇది సిరోసిస్, కాలేయ వైఫల్యానికి దారితీస్తుంది.

**లివర్ క్యాన్సర్:**

ఈ వ్యాధిని హెపాటోసెల్యులర్ కార్సినోమా అని కూడా అంటారు. హెపటైటిస్ లేదా సిర్రోసిస్ వంటి దీర్ఘకాలిక కాలేయ వ్యాధి ఉన్నవారిలో ఇది తరచుగా అభివృద్ధి చెందుతుంది. కాలేయ క్యాన్సర్ దూకుడుగా ఉంటుంది.. ఆలస్యంగా నిర్ధారణ అయితే, ఆ వ్యక్తి జీవించడం కష్టమవుతుంది. దీని లక్షణాలలో కడుపు నొప్పి, బరువు తగ్గడం, కామెర్లు ఉండవచ్చు.

**తీవ్రమైన కాలేయ వైఫల్యం:**

తీవ్రమైన కాలేయ వైఫల్యం.. ఈ పరిస్థితి చాలా అరుదు.. కానీ ఇది ఎవరికైనా జరిగితే, పరిస్థితి తీవ్రంగా మారుతుంది. దీని ఫలితంగా కాలేయ పనితీరు వేగంగా కోల్పోతుంది. ఇది తరచుగా కొన్ని రోజుల్లోనే కనిపిస్తుంది. ఇది మందుల అధిక మోతాదు (పారాసెటమాల్ వంటివి), వైరల్ ఇన్ఫెక్షన్లు లేదా ఆటో ఇమ్యూన్ వ్యాధుల వల్ల కావచ్చు. మీరు మీ ప్రాణాలను కాపాడుకోవాలనుకుంటే, వెంటనే చికిత్స చేయించుకోవాలి. కాలేయానికి సంబంధించి మీరు ఏదైనా సమస్యతో బాధపడుతుంటే.. వెంటనే వైద్యులను సంప్రదించాలి.. వారు పరీక్షలను సిఫారసు చేసి.. దానికి తగినట్లు వైద్యం అందిస్తారు.

## నాలుగే నాలుగు వారాలు టీకి దూరంగా ఉండి చూడండి శరీరంలో జరిగే మార్పులు ఊహించలేరు



వీటికి దూరంగా ఉండటం వల్ల ఎక్కువ సేపు హాయిగా నిద్రపోవచ్చని, అలాగే తొందరగా పడుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నాలుగు వారాల పాటు టీ, కాఫీలకు దూరంగా ఉన్నవారు ఎక్కువగా నిద్రపోయినట్లు, అలాగే తొందరగా పడుకున్నట్లు పలు అధ్యయనాలు కూడా వెల్లడించాయి. అంతేకాదు.. మనదేశంలో దాదాపు ప్రతి ఒక్కరూ చాయ్ ప్రియులే అని చెప్పాలి. ఎందుకంటే..దాదాపు అందరూ పొద్దున నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు టీ లాగించేస్తూనే ఉంటారు. ఉదయం నిద్రలేవగానే కప్పు కాఫీ, లేదా టీ కడుపులో పడకపోతే, బండికి ముందుకు సాగని పరిస్థితి చాలా మందికి ఉంటుంది. పని ఒత్తిడి తగ్గించుకోవడానికి.. బద్ధకాన్ని వదిలించుకోవడానికి చాలా మంది టీ తాగుతుంటారు. తలనొప్పిని తగ్గించుకోవడానికి కూడా చాలా మంది చాయ్ తాగుతుంటారు. ఏ ఇద్దరు స్నేహితులు కలిసినా కూడా ముందుగా కలిసేది టీ తోనే..అలాంటి టీ తో లాభాలు సరే.. నష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒక నెల రోజుల పాటు కాఫీ, టీలను పూర్తిగా తాగడం మానేయడం వల్ల మన శరీరంలో ఊహించని మార్పులు జరుగుతాయని చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం నెలరోజులు టీ తాగకపోతే నిద్ర నాణ్యత పెరుగుతుంది. టీ, కాఫీ అలవాటు మానేసిన వారిలో ముఖ్యంగా ఒక నెల రోజుల పాటు టీ, కాఫీలను తాగడం మానేస్తే నిద్రలేమి సమస్య ఉన్నవారికి మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. . వీటికి దూరంగా ఉండటం వల్ల ఎక్కువ సేపు హాయిగా నిద్రపోవచ్చని, అలాగే తొందరగా పడుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నాలుగు వారాల పాటు టీ, కాఫీలకు దూరంగా ఉన్నవారు ఎక్కువగా నిద్రపోయినట్లు, అలాగే తొందరగా పడుకున్నట్లు పలు అధ్యయనాలు కూడా వెల్లడించాయి. అంతేకాదు.. ఒక నెల రోజుల పాటు కాఫీ, టీలను తాగకపోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని చెప్పారు. నెల పాటు టీ తీసుకోకపోవడం ద్వారా రక్తపోటు కంట్రోల్‌లో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, షుగర్ లెవల్స్ కూడా అదుపులో ఉంటాయని చెప్పారు. టీ, కాఫీలకు దూరంగా ఉన్నవారిలో గతంకంటే చురుకుగా, హైడ్రేటెడ్‌గా ఉంటారు. టీ అధికంగా తీసుకోవడం వల్ల గ్యాస్, అజీర్ణం సమస్యలు వెంటాడుతున్నాయి. నెల పాటు టీ తాగకపోతే దంతాల పసుపు సమస్య ఉండదు

## రోజుకు ఎన్ని కీర దోసకాయలు తినడం మంచిది  నిపుణులు ఏం చెబుతున్నారంటే



కీరదోసకాయలో మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్, ఐరన్ వంటి విటమిన్లు ఉంటాయి. దీనిని తినడం వల్ల కిడ్నీల్లో రాళ్లు కరిగిపోయి.. మూత్ర సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. కీరదోసలో కాన్సర్‌ను నిరోధించే గుణాలు ఉన్నాయి. శరీర అవసరాలను బట్టి 2 నుంచి 3 కీరదోస తినాలి. ఏదైనా ఎక్కువగా వేసవిలో కీర దోసకాయ తినడం ఆరోగ్యానికి మంచిదనే విషయం మనందరికీ తెలిసిందే.. కీర దోసకాయలు పోషకాలు అధికంగా ఉండే కూరగాయలు. ఇవి హైడ్రేషన్, ఎముక ఆరోగ్యం, గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణ, బరువు తగ్గడం, చర్మ ఆరోగ్యం వంటి అనేక ప్రయోజనాలు కలిగి ఉంటాయి. రోజూ క్రమం తప్పకుండా కీరదోసకాయను తినటం వల్ల శరీరానికి తేమను అందిస్తూ హైడ్రేషన్‌ను పెంచుతుంది. ఇవి ఎముకలు బలంగా ఉండటానికి, గుండె ఆరోగ్యం మెరుగుపరచడానికి, జీర్ణక్రియ సజావుగా ఉండటానికి, చర్మం ఆరోగ్యాన్ని కూడా మెరుగు పడేలా చేస్తుంది. అయితే, రోజుకు ఎన్ని కీరదోసకాయలో మీకు తెలుసా..? ఇక్కడ తెలుసుకుందాం.. కీర దోసకాయ శరీరంలో వేడిని తగ్గిస్తుంది. ఊబకాయంతో బాధపడేవారికి కీరదోస మంచి ఔషధంగా పనిచేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాదు డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుతుంది. శరీరంలో చక్కెర నిల్వలను తగ్గించి షుగర్‌ను అదుపులో ఉంచుతుంది. అందువల్ల షుగర్ ఉన్న వారు కీరా తినాలని సూచిస్తున్నారు. కీరదోసలో నీరు పుష్కలంగా ఉంటుంది. వేసవిలో కీరదోస తింటే శరీరం చల్లబడుతుంది. కీరదోసకాయలో మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్, ఐరన్ వంటి విటమిన్లు ఉంటాయి. దీనిని తినడం వల్ల కిడ్నీల్లో రాళ్లు కరిగిపోయి.. మూత్ర సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. కీరదోసలో కాన్సర్‌ను నిరోధించే గుణాలు ఉన్నాయి. శరీర అవసరాలను బట్టి 2 నుంచి 3 కీరదోస తినాలి. ఏదైనా ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. కొందరికి కీరదోస తింటే ఆమ్లత్వం లేదా త్రేనుపులు వస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో దోసకాయ తినడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.రోజుకు ఎన్ని కీర దోసకాయలు తినడం మంచిది..! నిపుణులు ఏం చెబుతున్నారంటే. కీరదోసకాయలో మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్, ఐరన్ వంటి విటమిన్లు ఉంటాయి. దీనిని తినడం వల్ల కిడ్నీల్లో రాళ్లు కరిగిపోయి.. మూత్ర సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. కీరదోసలో కాన్సర్‌ను నిరోధించే గుణాలు ఉన్నాయి. శరీర అవసరాలను బట్టి 2 నుంచి 3 కీరదోస తినాలి. ఏదైనా ఎక్కువగా

### రోజుకు ఎన్ని కీర దోసకాయలు తినడం మంచిది..! నిపుణులు ఏం చెబుతున్నారంటే..

వేసవిలో కీర దోసకాయ తినడం ఆరోగ్యానికి మంచిదనే విషయం మనందరికీ తెలిసిందే.. కీర దోసకాయలు పోషకాలు అధికంగా ఉండే కూరగాయలు. ఇవి హైడ్రేషన్, ఎముక ఆరోగ్యం, గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణ, బరువు తగ్గడం, చర్మ ఆరోగ్యం వంటి అనేక ప్రయోజనాలు కలిగి ఉంటాయి. రోజూ క్రమం తప్పకుండా కీరదోసకాయను తినటం వల్ల శరీరానికి తేమను అందిస్తూ హైడ్రేషన్‌ను పెంచుతుంది. ఇవి ఎముకలు బలంగా ఉండటానికి, గుండె ఆరోగ్యం మెరుగుపరచడానికి, జీర్ణక్రియ సజావుగా ఉండటానికి, చర్మం ఆరోగ్యాన్ని కూడా మెరుగు పడేలా చేస్తుంది. అయితే, రోజుకు ఎన్ని కీరదోసకాయలో మీకు తెలుసా..? ఇక్కడ తెలుసుకుందాం.. కీర దోసకాయ శరీరంలో వేడిని తగ్గిస్తుంది. ఊబకాయంతో బాధపడేవారికి కీరదోస మంచి ఔషధంగా పనిచేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాదు డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుతుంది. శరీరంలో చక్కెర నిల్వలను తగ్గించి షుగర్‌ను అదుపులో ఉంచుతుంది. అందువల్ల షుగర్ ఉన్న వారు కీరా తినాలని సూచిస్తున్నారు. కీరదోసలో నీరు పుష్కలంగా ఉంటుంది. వేసవిలో కీరదోస తింటే శరీరం చల్లబడుతుంది. కీరదోసకాయలో మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్, ఐరన్ వంటి విటమిన్లు ఉంటాయి. దీనిని తినడం వల్ల కిడ్నీల్లో రాళు కరిగిపోయి.. మూత్ర సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. కీరదోసలో కాన్సర్‌ను నిరోధించే గుణాలు ఉన్నాయి. శరీర అవసరాలను బట్టి 2 నుంచి 3 కీరదోస తినాలి. ఏదైనా ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. కొందరికి కీరదోస తింటే ఆమ్లత్వం లేదా త్రేనుపులు వస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో దోసకాయ తినడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

**లీటరుకు రూ.3 భారంతో సామాన్యులకు షాక్ నాలుగేళ్ల తర్వాత ఇంధన ధరల్లో భారీ పెంపు**

**పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3చొప్పున పెంపు**

**అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావం**

**రవాణా రంగంతో పాటు సామాన్య, మధ్యతరగతిపై అదనపు భారం**



దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు భారీగా పెంచాయి. లీటరు పెట్రోల్‌పై రూ.3, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. దాదాపు నాలుగేళ్ల తర్వాత ఇంధన ధరల్లో ఇంత పెద్ద మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడం, హర్మూజ్ జలసంధి మార్గంలో అంతరాయాలు ఏర్పడటం వంటి కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగుతోంది. యుద్ధ ప్రభావం పశ్చిమాసియా దేశాలపై పడటంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు నెలకొన్నాయి.ఇంధన ధరల పెంపుతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.97.77కు చేరుకోగా, డీజిల్ ధర రూ.90.67గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.108.74, డీజిల్ రూ.95.13గా ఉండనుంది. ముంబయిలో పెట్రోల్ ధర రూ.106.68కు చేరుకోగా, డీజిల్ రూ.93.14గా ఉంది. చెన్నైలో పెట్రోల్ రూ.103.67, డీజిల్ రూ.95.25గా నిర్ణయించారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంధన ధరలు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 చొప్పున పెంపు నమోదైంది. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున ధరలు పెరిగాయి. దీంతో రోజువారీగా వాహనాలు వినియోగించే ప్రజలపై అదనపు భారం పడనుంది.ఈ ధరల పెంపుతో రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన పరిస్థితుల్లో ఇంధన ధరల పెంపు మరింత ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని భావిస్తున్నారు. సరుకు రవాణా ఖర్చులు పెరగడం వల్ల కూరగాయలు, పాలు, ధాన్యాలు, ఇతర అవసర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చమురు సంస్థలు రోజువారీ ధరల సవరణ విధానాన్ని 2022 ఏప్రిల్‌లో నిలిపివేశాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో దేశీయ వినియోగదారులపై భారం పడకుండా అప్పట్లో ధరలను స్థిరంగా ఉంచాయి. ఆ నిర్ణయం వల్ల ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. అయితే తర్వాతి కాలంలో ముడి చమురు ధరలు తగ్గడంతో కొంతవరకు ఆ నష్టాలను భర్తీ చేసుకున్నాయి.ఇటీవల పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల కారణంగా మళ్లీ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు 50 శాతం వరకు పెరిగినట్లు సమాచారం. ఫిబ్రవరిలో భారత్ దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ సగటు ధర బ్యారెల్‌కు 69 డాలర్లుగా ఉండగా, అనంతర నెలల్లో అది 113-114 డాలర్ల వరకు పెరిగింది. ఈ పరిస్థితుల్లో చమురు సంస్థలపై ఆర్థిక భారం పెరగడంతో ధరల పెంపు తప్పనిసరి అయిందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే దేశంలో ఇంధన కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఇటీవల దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా ఇంధన సరఫరాను నిరంతరంగా కొనసాగిస్తున్నామని చెప్పారు.ముడి చమురు నిల్వలు స్థిరంగా ఉన్నాయని, రిఫైనరీలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు తగినంతగా ఉన్నాయని, ఎక్కడా కొరత పరిస్థితులు లేవని స్పష్టం చేసింది. అయితే ధరల పెంపు కారణంగా సామాన్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, డెలివరీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ రంగానికి చెందినవారిపై ఈ ప్రభావం ఎక్కువగా పడనుంది. ఇప్పటికే పెరిగిన జీవన వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి ప్రజలకు ఈ నిర్ణయం మరో ఆర్థిక భారం కానుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# "డిజిటల్ పర్సనల్ లోన్" ఎలా పొందాలి

**ఆన్‌లైన్ ప్రాసెస్ ఎలా ఉంటుంది!**

**ఎక్కడి నుంచైనా డిజిటల్ వ్యక్తిగత రుణ కోసం ఈజీగా అప్లై చేసుకోవచ్చు**

**దరఖాస్తు నుంచి లోన్ తిరిగి చెల్లించడం వరకు ఈ ప్రాసెస్ అంతా ఆన్‌లైన్‌లోనే!**




ఒకప్పుడు రుణాలు కావాలంటే బ్యాంకుల చుట్టూ తిరిగేవాళ్లం. కానీ నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతికత, డిజిటలైజేషన్‌లో పురోగతి కారణంగా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. బ్యాంకింగ్ ఉత్పత్తులు, సేవలు డిజిటల్‌గా మారడం వల్ల కస్టమర్లు ఇంటి నుంచే అనేక ప్రయోజనాలను పొందుతున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం చాలా బ్యాంకులు డిజిటల్ లోన్స్‌ను ఎంచుకోవడానికి రుణగ్రహీతలను బాగా ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో ఎక్కడి నుంచైనా డిజిటల్ వ్యక్తిగత రుణ కోసం ఈజీగా అప్లై చేసుకోవచ్చు. దరఖాస్తు నుంచి లోన్ తిరిగి చెల్లించడం వరకు ఈ ప్రాసెస్ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. అసలు డిజిటల్ వ్యక్తిగత రుణాల ప్రాసెసింగ్ ప్రకియ ఎలా ఉంటుంది? అనే వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.డిజిటల్ పర్సనల్ లోన్‌లో ఫస్ట్ స్టెప్ రుణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం. రుణం కావాలనుకున్నవారు బ్యాంకు వెబ్‌సైట్‌లో లేదా మొబైల్ యాప్‌లో లాగిన్ అయ్యి అప్లికేషన్‌ను ఫిల్ చేసి సబ్మిట్ చేయాలి. ఒకవేళ మీకు క్రెడిట్ స్కోర్ ఎంత ఉందో తెలియకపోతే పాన్ నెంబర్ ఎంటర్ చేసి తెలుసుకోవచ్చు. ఇక కేవైసీ(ఖ్జ) కోసం దరఖాస్తుదారుడి ఫొటో, పాన్, ఆధార్ కార్డుకు సంబంధించిన సాఫ్ట్ కాపీని సమర్పించాలి. ఆదాయ పత్రాల కోసం, దరఖాస్తుదారుడి పే-స్లిప్‌లు/ఆదాయపు పన్ను రిటర్న్, బ్యాంకు స్టేట్‌మెంట్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.లోన్‌కు సంబంధించిన అప్లికేషన్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత వీడియో కేవైసీ ఉంటుంది. ఇందులో బ్యాంకు ఎగ్జిక్యూటివ్.. దరఖాస్తుదారుడి ఒరిజినల్ పాన్ కాపీని చూపించమంటారు. కొన్ని బ్యాంకులు అప్లై చేసుకునే సమయంలోనే డిజిటల్ కేవైసీని చేసే ప్రక్రియను కలిగి ఉంటాయి. కస్టమర్ సీకేవైసీ నంబర్‌ను నమోదు చేయమని అడగవచ్చు. కస్టమర్ కేవైసీ వివరాలు సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ నుంచి తీసుకుంటారు. కొన్ని బ్యాంకులు దరఖాస్తుదారుడి పాన్, ఆధార్ నంబర్‌ను నమోదు చేసి, దాన్ని ఆదాయపు పన్ను శాఖ, యూఐడీఏఐ డేటాబేస్‌తో ధ్రువీకరించమని అడుగుతాయి.కేవైసీ ధ్రువీకరణ అనంతరం బ్యాంక్ డిజిటల్ పర్సనల్ లోన్ అప్లికేషన్‌ను ప్రాసెస్ చేస్తుంది. అయితే ఈ సమయంలో రుణ దరఖాస్తును బ్యాంకులు యాక్సెప్ట్ లేదా రిజెక్ట్ చేసే అవకాశం ఉంటుంది. ఆమోదమనేది దరఖాస్తుదారుడి క్రెడిట్ స్కోరు, ఆదాయం, వృత్తి, వయసు, రుణ-ఆదాయ నిష్పత్తి మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటుంది. అయితే, డిజిటల్ వ్యక్తిగత రుణాల విషయంలో ఆమోద నిర్ణయం వేగంగా ఉంటుంది.లోన్ అప్లికేషన్‌ను యాక్సెప్ట్ చేసినాక రుణ పత్రాలపై డిజిటల్‌గా సంతకం చేసే ప్రక్రియను బ్యాంకు ప్రారంభిస్తుంది. డిజిటల్‌గా సంతకం చేయవలసిన రుణ పత్రాలలో కీలక వాస్తవాల నివేదిక, మంజూరు లేఖ, నిబంధనలు/షరతులు, ఖాతా స్టేట్‌మెంట్‌లు, రుణగ్రహీతల డేటాకు సంబంధించిన గోప్యతా విధానాలు మొదలైనవి ఉంటాయి. ఆధార్ ఆధారిత ఇ-సైన్ ద్వారా సంతకం చేయాలి. అన్ని డాక్యుమెంట్స్‌పై ఇ-సంతకం పూర్తయిన తర్వాత, బ్యాంకు.. ఆమోదించిన రుణ మొత్తాన్ని నేరుగా దరఖాస్తుదారుడి ఖాతాలో జమ చేస్తుంది. అనంతరం రుణగ్రహీత.. జుఙ×ల చెల్లింపుల కోసం ఆటో-డెబిట్ మాండేట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది.ఆటో-డెబిట్ మాండేట్ ప్రకారం, ప్రతి నెలా ఒక నిర్దిష్ట తేదీన, ఒక నిర్దిష్ట మొత్తానికి సంబంధించిన జుఙ× కస్టమర్ సేవింగ్స్ అకౌంట్ నుంచి డెబిట్ అవుతుంది. ఈ క్రమంలో చెల్లింపుల కోసం ప్రతి నెలా ఆటో డెబిట్‌కు ముందే తన బ్యాంకు ఖాతాలో తగినంత అమౌంట్ ఉండేలా చూసుకోవాలి. రుణగ్రహీత, తీసుకున్న లోన్‌ను బ్యాంకుకు పూర్తిగా చెల్లించేస్తే, "నో డ్యూస్ సర్టిఫికేట్" సాఫ్ట్ కాపీని పంపుతుంది.

# ష్యూరిటీ లేకుండానే రూ.4 లక్షల లోన్

**ఎలా పొందాలంటే?**

**బిజినెస్ చేసే మహిళల కోసం సూపర్ "స్కీమ్"**

**అర్హతలు, అప్లికేషన్ విధానం ఇదే!**



మీరు డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నారా? పారిశ్రామికవేత్త కావాలనుకుంటున్నారా? అయితే, మీకో గుడ్ న్యూస్. ఇండియన్ బ్యాంక్ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో ఒక సరికొత్త స్కీమ్‌ను స్టార్ట్ చేసింది. ఈ స్కీమ్ కింద అర్హులైన మహిళలకు ఎలాంటి ష్యూరిటీ లేకుండానే రూ.10 వేల నుంచి రూ.4 లక్షల వరకు లోన్స్ ఇస్తోంది. వడ్డీ కూడా తక్కువే! మరి, ఇండియన్ బ్యాంక్ తీసుకొచ్చిన ఆ స్కీమ్ ఏంటి? దాని ద్వారా లబ్ధి పొందడానికి ఉండాల్సిన అర్హతలు ఏంటి? తిరిగి చెల్లించే కాలపరిమితి, కావాల్సిన పత్రాలేంటి, ఎలా అప్లై చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.డ్వాక్రా సంఘాల్లో సభ్యులైన మహిళలకు కొత్తగా బిజినెస్ ప్రారంభించడానికి లేదా ఉన్న వ్యాపారాన్ని డెవలప్ చేసుకోవడానికి బ్యాంకులు తక్కువ వడ్డీకి లోన్స్ అందిస్తుంటాయి. అందులో భాగంగానే 'కేంద్ర ప్రభుత్వ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్' కింద ఇండియన్ బ్యాంక్ మహిళా సంఘాల్లో సభ్యులకు లోన్స్ ఇస్తోంది. ముఖ్యంగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఒక స్కీమ్‌ను ప్రారంభించింది. అదే, "ఐఎన్‌డీ ఎమ్ఎస్ఎమ్ఈ సఖి స్కీమ్‌ను ఈ స్కీమ్ ద్వారా తక్కువ వడ్డీకే కనీసం రూ.10 వేల నుంచి గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తోంది.ఈ లోన్‌కు ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్ ఫీజులు ఇతరత్రా ఏమీ ఉండవు. అర్హులైన మహిళలు ఎలాంటి పూచీకత్తు లేకుండానే ఈ రుణాన్ని తీసుకోవచ్చు. ఈ లోన్‌తో కొనుగోలు చేసిన యంత్రాలు, ఆస్తులనే గ్యారంటీగా చూపించవచ్చు. కొత్తగా ఏదైనా వ్యాపారం స్టార్ట్ చేయాలని ఇంట్రెస్ట్ ఉండి, పెట్టుబడి లేక ఇబ్బంది పడే మహిళలకు ఇది మంచి అవకాశంగా చెప్పుకోవచ్చు. తయారీ రంగం, సేవా రంగం లేదా వ్యాపార రంగాల్లో నిమగ్నమై ఉన్న లేదా కొత్తగా ప్రారంభించాలనుకునేవారికి ఈ స్కీమ్ కింద అందే పెట్టుబడి చాలా బాగా ఉపయోగపడుతుంది.

**ఎవరు అర్హులంటే?**

ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే దరఖాస్తుదారులకు కొన్ని నిబంధనలు విధించారు.

ఈ లోన్ పొందాలనుకునే మహిళ తప్పనిసరిగా ఏదైనా డ్వాక్రా సంఘంలో సభ్యురాలై ఉండాలి.

అలాగే, కనీసం రెండేళ్లపాటు లోన్ రీపేమెంట్ రికార్డు ఉండాలి. అంటే, రెండు సంవత్సరాలుగా సక్రమంగా రుణాలు చెల్లిస్తుండాలి.

వయసు 18 నుంచి 65 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు దీనికి అప్లై చేసుకోవచ్చు.

క్రెడిట్ స్కోర్ 600లకు పైగా ఉంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

రూ.1000కి రూ.2 వేలు ఇచ్చే ప్రభుత్వ పథకం - రిస్క్ తక్కువ, బెనిఫిట్స్ ఎక్కువ!

**తిరిగి చెల్లింపు కాలపరిమితి :**

ఇండియన్ బ్యాంక్ ఐఎన్‌డీ ఎమ్ఎస్ఎమ్ఈ సఖి స్కీమ్ కింద ఈ లోన్ తీసుకున్న మహిళలు 5 సంవత్సరాలలో లోన్ రీపేమెంట్ చేయాలి. లోన్ చెల్లించడానికి జుఙ× సదుపాయం కూడా ఉంటుంది. అవసరమైతే వ్యాపారం నిలదొక్కుకోవడానికి కొంతకాలం మారిటోరియం కూడా అడగవచ్చు.

**వడ్డీ రేటు :**

వ్యాపార రుణాలపై చాలా బ్యాంకులు ఎక్కువగా వడ్డీ వసూలు చేస్తుంటాయి. కానీ, ఇండియన్ బ్యాంక్ ఈ స్కీమ్ కింద చాలా తక్కువ వడ్డీ రేటుకే లోన్ సౌకర్యం కల్పిస్తోంది. ఐఎన్‌డీ ఎమ్ఎస్ఎమ్ఈ సఖి స్కీమ్ కింద తీసుకునే లోన్లపై రెపోరేటు +3.60 శాతం కలిపి వడ్డీగా చెల్లిస్తే సరిపోతుంది. అలాగే, మహిళలు కొనుగోలు చేసే యంత్రాలు లేదా వ్యాపార పెట్టుబడిలో కేవలం పదిశాతం మార్జిన్ అమౌంట్ చెల్లిస్తే మిగిలిన 90 శాతం బ్యాంక్ గ్రాంటుగా విడుదల చేస్తుంది.

**కావాల్సిన డాక్యుమెంట్స్ :**

ఆధార్ కార్డు

డ్వాక్రా సంఘంలో సభ్యత్వ వివరాలు

బ్యాంక్ స్టేట్‌మెంట్

మీరు చేయబోయే వ్యాపారానికి సంబంధించిన వివరాలు

పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో

ఎలా అప్లై చేసుకోవాలి?

ఈ స్కీమ్‌కు కావాల్సిన అర్హతలు కలిగి ఉన్న మహిళలు లోన్ కోసం మీ దగ్గరలోని ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను సంప్రదించి అప్లై చేసుకోవచ్చు లేదంటే ఆన్‌లైన్‌లో ఇండియన్ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

# "బైక్" కొనాలనుకుంటున్నారా

**ఫైనాన్స్‌లో కొంటే మంచిదా , క్యాష్ చెల్లిస్తే మేలా**

**"టూవీలర్" ఫైనాన్స్‌లో తీసుకోవడం మంచిదేనా**

**నిపుణులు ఏం చెబుతున్నారంటే**



ఇప్పుడు ద్విచక్ర వాహనం ఒక అవసరం. కాదు, కాదు అత్యవసరం. కారు కూడా అవసరాల జాబితాలో చేరిపోయిన నేటి పరిస్థితుల్లో, ప్రతీ ఇంట్లో బైక్ ఉండడం అనివార్యంగా మారిపోయింది. అందుకే, చాలా మంది చిన్నదో, పెద్దదో ఒక బైక్ కొనుగోలు చేస్తుంటారు.అయితే, బైక్ కొనుగోలు చేసే సమయంలో కొంతమంది మొత్తం ఒకేసారి డబ్బు చెల్లించే స్థోమత లేక లోన్ తీసుకుంటుంటారు. ఇంకొందరు మాత్రం మొత్తం ఒకేసారి చెల్లిస్తుంటారు. ఇదే క్రమంలో చాలా మందికి బైక్ కొనుగోలు విషయంలో రకరకాల సందేహాలు వస్తుంటాయి. ఇంతకీ, బైక్ తీసుకునేటప్పుడు మొత్తం ఒకేసారి చెల్లిస్తే మేలా? లేక ఫైనాన్స్‌లో తీసుకుంటే మంచిదా దీనిపై ఆర్థిక నిపుణులు ఏం చెబుతున్నారో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ద్విచక్రవాహనం కొనుగోలు టైమ్‌లో ఫైనాన్స్ లేదా లోన్ చెల్లింపు కోసం ఈఎంఐ ఆప్షన్ ఎంచుకోవడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉంటాయంటున్నారు ఆర్థిక నిపుణులు. అలాంటి వాటిల్లో కొన్నింటి గురించి ఇప్పుడు చూద్దాం.మీరు బైక్ కొనుగోలు చేసేటప్పుడు వాయిదాల పద్ధతి ఎంచుకుంటే.. వెహికల్ ఖరీదు మొత్తం ఒకేసారి కట్టాల్సిన అవసరం ఉండదు. దాంతో కొంచెం ఎక్కువ ధర బైక్‌నైనా కొనుగోలు చేసే ఛాన్స్ ఉంటుంది. మీ డ్రీమ్ బైక్ తీసుకునేందుకు ఇదొక మంచి అవకాశం. అలాగే, కొన్నిసార్లు తగినంత డబ్బు లేకపోవడం వల్ల రాజీపడి మన అవసరాలకు తగిన ద్విచక్రవాహనం తీసుకోలేకపోతాం. అదే లోన్ లేదా ఫైనాన్స్ తీసుకుంటే అలా రాజీపడాల్సిన అవసరం ఉండదంటున్నారు నిపుణులు.బైక్/స్కూటీ/స్కూటర్ కొనుగోలు కోసం ఒకేసారి డబ్బు చెల్లిస్తే మీ జేబులు ఖాళీ అయ్యే ఛాన్స్ ఉంటుంది. పైగా మీరు సేవ్ చేసిన డబ్బు నుంచి కొంత సొమ్ము తీయాల్సి రావొచ్చు. అలాంటి టైమ్‌లో ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఇబ్బందులు తప్పవంటున్నారు నిపుణులు. అదే, ఈఎంఐ ఎంచుకుంటే మీ పొదుపు జోలికి వెళ్లాల్సిన పని లేదు. అలాంటప్పుడు మీరు ఎలాంటి ప్రాబమ్స్‌ను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉన్నట్లే అంటున్నారు.మీరు ఈఎంఐలో బైక్ తీసుకున్నట్లయితే అందుకోసం నెల నెలా మీ ఆదాయం నుంచి కొంత డబ్బు పక్కన పెట్టాల్సి ఉంటుంది. అలా మీకు తెలియకుండానే పొదుపు చేయడం అలవాటు అవుతుందంటున్నారు నిపుణులు. మీ వెహికల్ లోన్ తీరిన తర్వాత కూడా దాన్ని అలాగే కంటిన్యూ చేస్తే పొదుపు పెరుగుతుందంటున్నారు. దాన్ని సరైన పద్ధతిలో మదుపు చేస్తే సంపద సైతం సృష్టించుకోవచ్చని సూచిస్తున్నారు.చాలా మంది పత్రాలు, ప్రక్రియలకు భయపడే లోన్ తీసుకోవడానికి వెనుకాడుతుంటారు. కానీ, ప్రస్తుతం చాలా కంపెనీలు తక్షణమే ఆన్‌లైన్‌లో రుణాలు అందిస్తున్నాయి. అన్ని అర్హతలూ ఉండి పత్రాలన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే గంటల్లో లోన్స్ మంజూరు చేస్తున్న సంస్థలు ఉన్నాయి. అయితే, వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా కంపెనీల విశ్వసనీయతను గుర్తించడంలో విఫలమైతే ఇబ్బందులు తప్పవని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు.ప్రస్తుతం కొన్ని బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలు తక్కువ వడ్డీ రేటుకే లోన్స్ అందిస్తున్నాయి. ఇది ఒక మంచి అవకాశం అనే చెప్పుకోవాలి. టూ వీలర్ లోన్స్‌పై వడ్డీ రేట్లు 7.60% నుంచి 28% శాతం వరకు ఉంటున్నాయి. అయితే, ఈ వడ్డీ రేటు అనేది మీరు తీసుకునే బ్యాంకు, కాలపరిమితిని బట్టి మారుతూ ఉంటుందని గమనించాలి.

# పన్ను చెల్లింపుదారులకు అలర్ట్

**ఐటీఆర్ ఫైలింగ్ షురూ**

**2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఐటీఆర్ ఫైలింగ్ ప్రారంభం**

**ఐటీఆర్-1, ఐటీఆర్-4 ఫారాల కోసం ఎక్సెల్ యుటిలిటీలు విడుదల**

**ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో రిటర్నులు దాఖలు చేసే సౌకర్యం**

**నాన్-ఆడిట్ పన్ను చెల్లింపుదారులకు గడువు జులై 31**




పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ ముఖ్యమైన అప్‌డేట్ ఇచ్చింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025-26 ఆర్థిక సంవత్సరం) సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు ఐటీఆర్-1 (సహజ్), ఐటీఆర్-4 (సుగం) ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీలను ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది.ఈ విషయాన్ని ఆదాయపు పన్ను శాఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా తెలియజేసింది. పన్ను చెల్లింపుదారులు ఇప్పుడు ఈ రెండు ఫారాలను ఆన్‌లైన్‌లో నేరుగా ఫైల్ చేయవచ్చని లేదా ఎక్సెల్ యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లో కూడా నింపవచ్చని స్పష్టం చేసింది. ఆఫ్‌లైన్‌లో ఫారమ్ నింపిన వారు, ఆ తర్వాత జేసాన్ ఫైల్‌ను జనరేట్ చేసి, ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆడిట్ పరిధిలోకి రాని పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నులను దాఖలు చేయడానికి సాధారణంగా జులై 31 చివరి తేదీగా ఉంటుంది.ఐటీఆర్-1 (సహజ్) ఫారాన్ని రూ.50 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న నివాస భారతీయులు ఉపయోగించవచ్చు. ఇక, ఐటీఆర్-4 (సుగం) ఫారాన్ని రూ.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఎల్ఎల్‌పీలు మినహా ఇతర సంస్థలు దాఖలు చేయవచ్చు.ఈ అసెస్‌మెంట్ సంవత్సరానికిగాను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ఇప్పటికే కొత్త నిబంధనలతో కూడిన ఐటీఆర్ ఫారాలను నోటిఫై చేసింది. దీని ప్రకారం లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్, షేర్ల బైబ్యాక్ లావాదేవీల వల్ల కలిగిన నష్టాలు వంటి అదనపు వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12% వృద్ధితో రూ.23,40,406 కోట్లకు చేరినట్లు సీబీడీటీ గణాంకాలు వెల్లడించాయి.

# పసిడి ప్రియులకు ఊరట

**భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు**

**కొనసాగుతున్న బంగారం ర్యాలీకి బ్రేక్**

**10 గ్రాముల బంగారంపై రూ.2,240 వరకు తగ్గుదల**

**హైదరాబాద్‌లో రూ.1.60 లక్షలకు దిగివచ్చిన పసిడి**

**కిలో వెండి ధరలో రూ.10,000 భారీ కోత**



ఇటీవల పరుగులు పెడుతున్న బంగారం ధరల జోరుకు బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాలను పెంచడం వంటి కారణాలతో శుక్రవారం దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. కొనుగోలుదారులకు ఇది కాస్త ఊరటనిచ్చే విషయమనే చెప్పాలి.గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ అందించిన సమాచారం ప్రకారం ఈరోజు (మే 15) ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,240 తగ్గి రూ.1,60,090 వద్దకు చేరింది. ఇక, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా రూ.2,050 తగ్గి రూ.1,46,750 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.10,000 కోత పడటంతో ప్రస్తుతం రూ.3.05 లక్షల వద్ద కొనసాగుతోంది.దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,60,090గా ఉండగా, ఢిల్లీలో రూ.1,60,240గా ఉంది. చెన్నైలో మాత్రం కాస్త ఎక్కువగా రూ.1,63,390 వద్ద ట్రేడవుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ కిలో వెండి ధర రూ.3.05 లక్షల వద్దనే కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే దేశవ్యాప్తంగా పసిడి, వెండి ధరల్లో భారీ తగ్గుదల నమోదైంది.



# పెద్ది' పవర్ ప్లే టూర్ షురూ..
# 8 రోజుల్లో 7 నగరాలు, భారీ వేడుకలకి పక్కా స్కెచ్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్, రెండు పాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ముఖ్యంగా ఈ సినిమాలో రామ్ చరణ్ కుస్తీతో పాటు క్రికెట్ ఆడే పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన విజువల్స్ స్పష్టం చేశాయి. మాస్, ఎమోషన్, స్పోర్ట్స్ అంశాల కలయికగా రూపొందుతున్న ఈ చిత్రంపై రోజురోజుకీ హైప్ పెరుగుతోంది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ను కూడా భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. ఓ అభిమాని "పెద్ది ప్రమోషన్స్ ఎక్కడ?" అంటూ లేఖ రాయగా, దానికి స్పందించిన చిత్రబృందం 'పవర్ ప్లే టూర్' పేరుతో ప్రత్యేక ప్రమోషనల్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో ఏ తేదీన ఏ నగరంలో ఈవెంట్ జరుగుతుందో ప్రకటించారు. మే 18న ముంబైలో భారీ వేడుక నిర్వహించి 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత మే 22న ఉప్పల్ స్టేడియంలో భారీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకలో ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో ప్రత్యేక సంగీత కచేరీ నిర్వహించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. మే 23న భోపాల్‌లో ప్రత్యేక పాటల విడుదల కార్యక్రమం ఉండనుండగా, మే 24న బెంగళూరులో మరో భారీ ఈవెంట్ జరగనుంది. అనంతరం మే 28న ఢిల్లీలో, మే 30న చెన్నైలో ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక జూన్ 1న విజయనగరంలో అభిమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. సినిమా కథ విజయనగరం నేపథ్యంతో సాగనున్న నేపథ్యంలో అక్కడి ఈవెంట్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. చివరగా జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ప్రీ రిలీజ్ వేడుకను అభిమానుల మధ్య నిర్వహించనున్నారు. మొత్తంగా కేవలం 8 రోజుల్లో 7 నగరాల్లో 'పెద్ది' ప్రమోషన్స్ ప్లాన్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. "ఇదే అసలైన పాన్ ఇండియా ప్రమోషన్" అంటూ రామ్ చరణ్ అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ట్రైలర్ విడుదలతో 'పెద్ది' ఫీవర్ మరింత పెరగనుందని, విడుదలకు ముందే సినిమా దేశవ్యాప్తంగా భారీ హైప్ సృష్టించడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# రష్మిక కష్టాలు ..
# కాళ్లకు టేప్ వేసుకొని మరి..!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. "ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం" అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

# హీరో ఇష్యూ మానసికంగా నన్ను ఇబ్బంది పెట్టింది..
# చాలా బాధ పడ్డాను..



నిత్యా మీనన్ కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషలలో దాదాపు 50కి పైగా సినిమాల్లో నటించి తనదైన ముద్ర వేశారు. 2011లో వచ్చిన 'అలా మొదలైంది' సినిమాతో టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేసి మొదటి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే', 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'జనతా గ్యారేజ్' 'భీమ్లా నాయక్' వంటి సినిమాలతో సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తమిళం, మలయాళంలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది. అయితే గతంలో ఓ ఇంటర్వ్యూలో నిత్యా మీనన్ మాట్లాడుతూ ఓ హీరో ఇష్యూ కారణంగా తాను చాలా బాధపడ్డానని అన్నారు. నిత్యా మీనన్ కెరీర్ ఆరంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "ప్రభాస్ ఎవరు?" అని అడగడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ విషయంపై ఆమె క్లారిటీ ఇస్తూ, ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదాన్నని, కేవలం ఆ ఒక్క మాటను పట్టుకుని తనను చాలా ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన నిజాయితీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఆ విషయాన్ని పెద్దది చేశారని ఆమె పేర్కొన్నారు. ఆ సంఘటన తర్వాతే అందరి దగ్గర నిజాయితీగా ఉండకూడదని, కొన్నిసార్లు 'డిప్లొమాటిక్'గా వ్యవహరించడం అవసరమని తాను నేర్చుకున్నానని నిత్య చెప్పారు. "ప్రతి ఒక్కరూ నా నిజాయితీకి అర్హులు కారు" అని ఆ ఇష్యూ ద్వారా తనకు అర్థమైందని, ఆ తర్వాతే తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని వివరించారు. ప్రభాస్ ఇష్యూ కారణంగా తాను మానసికంగా ఇబ్బంది పడ్డానని అన్నారు. అలాగే తన గురించి వచ్చిన ట్రోల్స్ పై స్పందిస్తూ.. దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని, ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫోటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని ఆమె తెలిపారు. కొన్ని ఘటనలు తన జీవితంలో ఒక పెద్ద పాఠం నేర్పిందని, అప్పటి నుండి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారానని నిత్యా మీనన్ ఈ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

# నాగబాబు మేము'కాప్'లం ట్రైలర్ వచ్చేసింది



జీ5 ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో డిఫరెంట్ వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. అదే "మేము'కాప్'లం". కొన్నాళ్ల నుంచి ఈ సిరీస్ టైటిల్ దగ్గర నుంచి ప్రతీ విషయంలోనూ క్యూరియాసిటీని పెంచుతోంది. మే 22 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచేలా "మేము'కాప్'లం" ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. మహదేవపట్నం అనే ప్రాంతంలో కథ మొదలవుతుంది. అయ్యగారు వారసుడొచ్చాడండోయ్.. అని పాలేరు అని అరిచి మరి చెబుతాడు. అప్పుడు గజపతిరాజు పాత్రలో నటించిన నాగబాబు ఆనందపడతాడు. సలార్‌రాజు తన వారసుడు అని ప్రకటిస్తాడు. అయితే అనుకోకుండా ఆ సలార్ రాజు కనిపించకుండా పోతాడు. దీంతో ఊరంతా గందరగోళంలో పడుతుంది. ఇంతకీ సలార్ రాజు ఎవరో కాదు.. కోళ్ల పందెల్లో పాల్గొనాల్సిన కోడిపుంజు. దీన్ని వెతకటానికి ఇద్దరు పోలీసులు(గెటప్ శీను, రవితేజ నన్నిమల) ఊళ్లోకి వస్తారు. సలార్ రాజు కనిపించకపోవటం వల్ల..ఎవరికి లాభం అనే కోణంలో పోలీసులు అన్వేషిస్తుంటారు. అయితే వారికి ఊళ్లో మరో సమస్య కనిపిస్తుంది. దీంతో వాళ్లు కొత్త సమస్య నుంచి ఊరిని బయటపడేయటానికి ప్రయత్నిస్తారు. ఇంతకీ మహదేవపట్నంలోని ప్రధాన సమస్య ఏంటి? పోలీసులు దాన్ని ఎలా పరిష్కరిస్తారు. అసలు ఇంతకీ సలార్ రాజు దొరికాడా? లేదా? అనే విషయాలు తెలియాలంటే మే 22న జీ5లో స్ట్రీమింగ్ కానున్న "మేము'కాప్'లం" వెబ్ సిరీస్ చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.

నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన "మేము 'కాప్'లం" సిరీస్‌ను రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందింది. 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమల కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, మిస్టరీ కలయికగా అందరినీ ఆకట్టుకునే కథాంశంతో..గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం..ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కింది.



# విరోష్ జంట.. సోషల్ మీడియాలో సరికొత్త రికార్డ్

ఈ ఏడాది పెళ్లిబంధంలోకి అడుగుపెట్టిన జంట విజయ్- రష్మిక. కొన్నేళ్లుగా డేటింగ్ ఉన్న వీరిద్దరు ఉదయ్‌పూర్ వేదికగా ఒక్కటయ్యారు. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లిబంధంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో టాలీవుడ్ సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఈవెంట్ నిర్వహించారు. అయితే విరోష్ జంటగా క్రేజ్ తెచ్చుకున్న వీరిద్దరు ఓ యాడ్ ప్రమోట్ చేశారు. ప్రముఖ ఎయిర్ బీఎన్ బీ కపుల్ యాడ్‌లో పాల్గొన్నారు. దీనికి ఏకంగా 9.1 మిలియన్ లైక్స్ వచ్చాయి. దీంతో ఇన్‌స్టాలో మరో గ్లోబల్ రికార్డ్ క్రియేట్ జంటగా విరోష్ జోడీ నిలిచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక యాడ్‌కు వరల్డ్ వైడ్‌గా వచ్చిన రెండో అత్యధిక లైక్స్ ఇవే కావడం విశేషం. దీంతో విజయ్- రష్మిక ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం వీరిద్దరు జంటగా రణబాలిలో కనిపించనున్నారు.

మొదటి ప్లేస్ కూడా వీరిదే..

ఈ జాబితాలో మొదటి స్థానం రికార్డ్ సైతం వీరిదే కావడం గమనార్హం. గతంలో వీరిద్దరూ కలిసి చేసిన మాన్యవార్ అనే వెడ్డింగ్ యాడ్ 11.5 మిలియన్లకు పైగా లైక్స్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దీనికి తోడు 104 మిలియన్ల వ్యూస్ రావడం విశేషం. ప్రముఖ దిగ్గజాలు మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో వంటి గ్లోబల్ ఐకాన్స్ కలిసి చేసిన ఇంటర్నేషనల్ బ్రాండ్ యాడ్స్‌కు మించిన ఆదరణ విరోష్ జంటకు అందరినీ షాకింగ్‌కు గురి చేస్తోంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.